నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ శనివారం 19-9-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:40 పేజీలు: 4 వెల: రూ.1/-

పీఎం కేర్స్ ఏర్పాటుపై లోక్‌సభలో దుమారం

సవరణ బిల్లును ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి నిర్మిలా సీతారామన్
బిల్లును వ్యతిరేకించిన విపక్ష సభ్యులు
విరాళాలు ప్రభుత్వం ఖాతాలోకి వెళ్లవన్న అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): పీఎం కేర్స్ ఏర్పాటుపై లోక్‌సభలో దుమారం చెలరేగింది. విపక్ష సభ్యులు పీఎం కేర్స్ ఏర్పాటును వ్యతిరేకించారు. పన్నులు, ఇతర చట్టాల సడలింపు, సవరణ బిల్లును కేంద్ర మంత్రి నిర్మిలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఈ నేపథ్యంలో సభ్యులు తమ అభిప్రాయాలు వినిపించారు. ఎంపీలు శశిథరూర్, ఏఎం ఆరిఫ్, అధిర్ రంజన్ చౌదరీలు బిల్లును వ్యతిరేకించారు. ఆర్టికల్ 266కు వ్యతిరేకంగా పీఎం కేర్స్ ఉందని అధిర్ ఆరోపించారు.

కోవిడ్19 నేపథ్యంలో పన్నుల చెల్లింపు గడువును పొడిగిస్తూ ట్యాక్సేషన్ బిల్లును తీసుకువచ్చారు. పీఎం జాతీయ రిలీఫ్ ఫండ్‌కు ఉన్న మినహాం ఐంపులే పీఎం కేర్స్ ఫండ్‌కు వర్తిస్తాయని బిల్లులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో విపక్ష సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. కొత్తగా నిధిని ఏర్పాటు చేయడానికి కారణం ఏంటని ప్రశ్నించారు. ఒకవేళ పీఎం కేర్స్ ప్రజాధనమే అయితే, మరి కాగ్ ఎందుకు ఆడిట్ చేయదన్నారు. ఇప్పటికే నేషనల్ రిలీఫ్ ఫండ్, క్యాప్సర్ ఫండ్‌లు ఉన్నాయని, ఇప్పుడు కొత్తగా పీఎం కేర్స్ ఎందుకు అని, అన్నింటినీ నేషనల్ రిలీల్ ఫండ్‌లో కలిపేయాలని టీఎంసీ నేత సౌగత్ రాయ్ కోరారు. పీఎం కేర్స్ ఫండ్‌కు కల్పించిన ప్రత్యేక అధికారాలను కాంగ్రెస్ ఎంపీ మనీష్ తివారీ తప్పుపట్టారు. పీఎం కేర్స్ నిధి విషయంలో బీజేపీ, విపక్ష సభ్యుల మధ్య మాటల ఘర్షణ కొనసాగింది. విపక్ష సభ్యుల ప్రశ్నకు కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ స్పందించారు. విపక్ష సభ్యుల ఆరోపణలను ఆయన కొట్టిపారేశారు. పీఎం కేర్స్‌పై ఉన్న కేసులన్నింటికీ కోర్టులు కొట్టిపారేశాయన్నారు. ఒకవైపు కోవిడ్ సంక్షోభం ఏర్పడితే ఏప్రిల్‌లో కోర్టును ఆశ్రయించారని, ఫండ్‌పై ఆర్టీఐ దరఖాస్తును కూడా ఢిల్లీ హైకోర్టు కొట్టివేసిందన్నారు. పీఎం కేర్స్ ఫండ్‌కు వచ్చిన విరాళాలు ప్రభుత్వం ఖాతాలోకి వెళ్లవన్నారు. పీఎంఎన్ఆర్ఎఫ్‌ఫై ఠాకూర్ విమర్శలు చేశారు. పీఎం ఎన్ఆర్ఎఫ్‌ను కనీసం రిజిస్టర్ కూడా చేయలేదన్నారు. ఆ నిధి కేవలం గాంధీ కుటుంబానికే ఉపయోగపడిందన్నారు. ఈ సమయంలో అధిర్ రంజన్ ఆ వ్యాఖ్యలను ఖండించారు. పీఎం కేర్స్ ఫండ్ కోసం చైనా కంపెనీల నుంచి నిధులను తీసుకున్నట్లు అధిర్ ఆరోపించారు. దీనిపై దర్యాప్తు చేపట్టాలన్నారు. నేషనల్ రిలీఫ్ ఫండ్‌ను గాంధీ కుటుంబం అక్రమంగా వాడినట్లు ఠాకూర్ కౌంటర్ రిప్లే ఇచ్చారు. ఈ సందర్భంలో ఠాకూర్ మాట్లాడుతూ పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ వల్ల ఎవరు బెనిఫిట్ పొందారో బయటపెడుతామని అన్నారు

ఈ సందర్భంలో విపక్ష, ప్రభుత్వ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఓ దశలో స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని సభ్యులను శాంతింప చేసే ప్రయత్నం చేశారు. ఆ సందర్భంలో టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ బీజేపీ సభ్యులను మీరేమీ అనడంలేదని, మీరు మమ్ముల్ని సస్పెండ్ చేయవచ్చు అని, కానీ వారిని రక్షించడం సరికాదు అన్నారు. . అయితే మంత్రికి కూడా వార్నింగ్ ఇచ్చామని స్పీకర్ తెలిపారు. అనురాగ్ ఠాకూర్ అంశాన్ని రాజకీయం చేస్తున్నారని అధిర్ రంజన్ అన్నారు. ఒక్కొక్కరి గుట్టు బయటపెడుతామని అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్యల పట్ల క్షమాపణలు చెప్పాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. సభలో గందరగోళం నెలకొనడంతో అరగంట సేపు వాయిదా వేశారు.

కరోనాతో మాదాపూర్ ఎస్ఐ మృతి

హైదరాబాద్,సెప్టెంబర్18 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా వైరస్ ప్రమాదకర స్థాయిలో విజృంభిస్తోంది. ముఖ్యంగా కరోనాపై పోరులో ముందున్న ఫ్రంట్‌లైన్ వారియర్స్‌పై తీవ్ర ప్రతాపం చూపుతోంది. ఇప్పటికే వైరస్ బారినపడి వైద్యులు, పోలీసు అధికారులు చాలామంది ప్రాణాలు కోల్పోయారు. తాజాగా కరోనాసోకి మాదాపూర్ ఎస్ఐ అబ్బాస్ అలీ మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న అలీకి ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఈ క్రమంలోనే ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంపై రాష్ట్ర పోలీస్ శాఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.

ఎంపి ల్యాడ్స్‌ను కరోనాకే వాడాలి: కెకె

న్యూఢిల్లీ,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): కోవిడ్ పునరావాస కార్యక్రమాలకే ఎంపీ ల్యాడ్స్ నిధులు వెళ్లాలని టీఆర్ఎస్ ఎంపీ కే కేశవ రావు తెలిపారు. ఎంపీలు, మంత్రుల జీతాల కోత బిల్లుపై ఆయన తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఎంపీలు తమ నిధులను ఒక ఏడాది పాటు స్వయంగా ఇచ్చేందుకు అంగీకరించామని ఎంపీ కేశవరావు గుర్తు చేశారు. సుమారు వంద కోట్ల ఎంపీ ల్యాడ్స్ నిధులను కేంద్రానికి ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. సదరు కేంద్ర మంత్రికి కూడా ఈ విషయం తెలుసు అని ఆయన స్పష్టం చేశారు. అయితే తమ రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఇచ్చిన నిధులను కేవలం కోవిడ్ పునరావాస కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని ఆయన అన్నారు. ఎంపీ నిధులపై కేంద్రం విధించిన షరతును వ్యతిరేకిస్తున్నా.. తాము ఇచ్చిన నిధులు మాత్రం కోవిడ్ రిహాబిలిటేషన్‌కే వాడాలన్నారు.

ప్రహసనంగా ముగిసిన డబుల్ ఇళ్ల సందర్శన

రెండోరోజు అర్ధాంతరంగా ముగిసిన పర్యటన
లక్ష ఇళ్లు చూపించడంలో విఫలమయ్యారన్న భట్టి
కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డ మంత్రి తలసాని

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): నగరంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సందర్శన ప్రహసనంగా ముగిసింది. కాంగ్రెస్ నేతలను తీసుకుని బయలుదేరిన మంత్రి తసలాని మధ్యలోనే నాగారం నుంచి వెనుదిరగడంతో కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. మొత్తంగా లక్ష ఇళ్లు సందర్శిస్తమాన్న పర్యటన రెండోరోజుకే ముగిసింది. మరోవైపు మంత్రి, సిఎల్పీ నేతల మధ్య పరస్పర విమర్శలు చెలరేగాయి. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల నేపథ్యంలో మహానగర అభివృద్ధి కేంద్రంగా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సంవాదం జరుగుతున్న విషయం విదితమే. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంపై మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, ప్రతిపక్ష నేత భట్టి విక్రమార్క మధ్య సవాల్ నడిచింది. ఈ క్రమంలో తాను స్వయంగా భట్టి ఇంటికెళ్లి ఆయన్ను తీసుకొని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను చూపించారు. రెండ్రోజుల పాటు పర్యటించారు. అయితే.. సడన్‌గా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పర్యటనకు బ్రేక్ పడింది. ఈ క్రమంలో టీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం మొదలైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఇళ్లు చూపించమంటే పక్క నియోజకవర్గాల్లో ఇళ్లు చూపిస్తున్నారని భట్టి విక్రమార్క ఫైర్ అయ్యారు. అసహనం వ్యక్తం చేసి కొల్లూరుకు రావాలంటూ తలసాని వెళ్లిపోయారు. అయితే.. 150 డివిజన్ల పరిధిలో ఎక్కడ చూపించినా వస్తామని భట్టి విక్రమార్క చెప్పారు. నాగారం మున్సిపాలిటీ నుంచి కాంగ్రెస్ నేతలు వెనుదిరిగారు. భట్టీ మాత్రం రాంపల్లిలోనే ఆగిపోయారు. ఎవరి దారిన వారు వెళ్లిపోవడంతో రెండో రోజు కొనసాగుతున్న ఇళ్ల పరిశీలన అర్ధాంతరంగా ముగిసింది. మరోవైపు తలసాని, మల్లారెడ్డి, మేయర్ బొంతురామ్మోహన్ మాత్రం కొల్లూరుకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విమర్శల వర్షం కురిపించుకున్నారు. 'ఇళ్లు చూపించమంటే ప్రభుత్వం పారిపోయింది. నిన్న చూపిన 3,400 ఇళ్లను నేను పరిగణిస్తున్నాను. హైదరాబాద్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టకుండా ఇతర చోట్ల కట్టిన లెక్కలు చూపించి ప్రజల్ని మోసం చేస్తున్నారు. జీహెచ్ఎంసీలు ఇళ్లు చూపించమంటే మహేశ్వరంలో చూపిస్తున్నారు. 5 నియోజకవర్గాల్లో కేవలం 3,400 ఇళ్లే కట్టారు. లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఎక్కడున్నాయో చెప్పాలని సీఎం కేసీఆర్, కేటీఆర్‌కు ఛాలెంజ్ చేస్తున్నాను. లక్ష ఇళ్లు నిర్మించే వరకు ప్రభుత్వం వెంట పడతాం' అని భట్టీ విక్రమార్క ఛాలెంజ్ చేశారు. భట్టి కామెంట్స్‌పై మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇళ్లు పూర్తిగా చూడకుండా మాట్లాడొద్దు. ప్రభుత్వం కట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లన్నీ చూపిస్తున్నాం. ఓర్వలేక కాంగ్రెస్ నేతలు కుంటిసాకులు చెబుతున్నారు. వస్తే అన్నీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను చూపిస్తాం. ఈరోజు వరకే తిరుగుతాం.. మిగిలిన ఇళ్ల వివరాలు ఇస్తాం. తుక్కుగూడలో కట్టినా.. గ్రేటర్ ప్రజలకే ఇస్తాం' అని తలసాని మీడియాతో మాట్లాడుతూ చెప్పుకొచ్చారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై ప్రభుత్వం సమాధానం చెప్పలేక పోయిందని కాంగ్రెస్ శాసనసభ పక్ష నేత భట్టి విక్రమార్క విమర్శించారు. లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇళు చూపిస్తామని చెప్పి మంత్రి, అధికారులు పారిపోయారని ఆయన ఎద్దేవా చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో లక్ష ఇళ్లు చూపిస్తామని 3428 ఇళ్లు మాత్రమే చూపించారని చెప్పారు. మరోవైపు నగర శివారులో కట్టిన ఇళ్లు కూడా నగర వాసుల కోసమేనని మంత్రి తలసాని శ్రీనివాస్ తెలిపారు. స్థలాలు చూపిస్తాం.. నగరంలోనే ఇళ్లు నిర్మించాలన్న భట్టి మరోసారి సవాల్ విసిరారు. స్థలాలు చూపిస్తే ఇళ్లు నిర్మించి ఇస్తామన్న మంత్రి తలసాని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఇదిలావుంటే రెండోరోజు శుక్రవరాం ఇద్దరు నేతలు నగరంలో పర్యటించారు. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం మండలంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శుక్రవారం ఉదయం పర్యటించారు. తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో మంఖాల్ గ్రామంలో నిర్మాణం చేపడుతున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క సందర్శించారు. వీరితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత వి హనుమంత రావు తదితరులు పాల్గొన్నారు. మంఖాల్ గ్రామంలో నిర్మాణం చేపడుతున్న ప్రతి ఒక ఇంటికి తిరుగుతూ నేతలు పరిశీలించారు.

జీహెచ్ఎంసీ పరిధిలో అభివృద్ధికి సంబంధించి బుధవారం శాసనసభలో చర్చ జరుగుతుండగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణంపై తలసాని, భట్టి మధ్య వాడివేడి సంభాషణ జరిగింది. ప్రతిసారీ ఎన్నికల ముందు ఇళ్లు ఇస్తామని చెప్పడం ఆనవాయితీ అయిందని, మళ్లీ ఎన్నికలు వస్తున్నాయి కాబట్టే ఇళ్లను పంపిణీ చేస్తామంటున్నారని భట్టి అన్నారు. దీనికి స్పందించిన తలసాని.. తాను స్వయంగా భట్టి ఇంటికెళ్లి ఆయన్ను తీసుకొని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను చూపిస్తానని చెప్పారు. చెప్పిన విధంగానే గురువారం మంత్రి తలసాని స్వయంగా భట్టి ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి ఇరువురు నేతలు కలిసి జియాగూడలోని సంజయ్‌నగర్ బల్దియాకాలనీకి వెళ్లి అక్కడ 840 ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. తొలిరోజు దాదాపు 3428 ఇళ్లను నేతలు సందర్శించారు. అయితే లక్ష ఇళ్లు చూపే వరకు తాను నగరం విడిచి వెళ్లబోనని భట్టి స్పష్టం చేశారు.

లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లపై సీఎల్పీ నేత భట్టీ, మంత్రి తలసాని మధ్య మాటలవార్ కొనసాగుతోంది. కరోనాతో ఇళ్ల నిర్మాణం ఆలస్యమైందని మంత్రి తలసాని అన్నారు.ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లే కాదు.. హైదరాబాద్ లో జరిగిన అభివృద్ధిని చూపిస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసం కట్టే ఇల్లు కావన్నారు. ప్రభుత్వం పద్ధతి ప్రకారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేస్తుందన్నారు. ఇకపోతే వర్షం పడితే నీళు రాకుంటే? నిప్పు వస్తదా ? అని ప్రశ్నించారు. ఒకటి రెండు ఛానళ్లు కావాలనే రాద్దాంతం చేస్తున్నా యన్నారు. అభివృద్ధిని చూపించే దమ్ము, ధైర్యం మాకు ఉన్నాయని..చూసే వాళ్లకు కూడా నిజాయితీ ఉండాలన్నారు. రెండో రోజు డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించేందుకు వెళ్లారు మంత్రి తలసాని, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క? ఇవాళ గ్రేటర్ పరిధిలో డబుల్ ఇండ్లను పరిశీలించారు. హైదరాబాద్ లోని మొత్తం

తొమ్మిది ప్రాంతాలలోని నిర్మాణంలో ఉన్న ఇండ్లను చూడనున్నారు. అయితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రమే లక్ష డబుల్ బెడ్రూమ్ ఇండ్లు చూపించాలన్నారు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, గ్రేటర్ హైదరాబాద్ బయట నిర్మిస్తున్న ఇండ్లను చూసిస్తే తాము ఒప్పుకోమన్నారు.

లాలూ కారణంగా ప్రాజెక్టులు ఆగాయి

రైతులకు అండగా నిలిచేలా వ్యవసాయ బిల్లు
కోసీ రైల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): బీహార్‌లోని కోసీ రైల్ బ్రిడ్జిని ప్రారంభించిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆర్జేడీ అధినేత, రైల్వేశాఖ మాజీ మంత్రి లాలూప్రసాద్ యాదవ్‌పై విమర్శలు చేశారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వ హయాంలో కోసీ ప్రాజెక్టు పనులు వేగంగా జరిగాయని, ఆ తర్వాత ఈ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయని ప్రధాని ఎద్దేవాచేశారు. అప్పటి రైల్వే మంత్రులు ఈ ప్రాజెక్టు గురించి కనీస ఆందోళన కూడా చెందలేదని పరోక్షంగా లాలూపై మండిపడ్డారు. లాలూప్రసాద్ యాదవ్ గనుక అనుకుని ఉంటే ఈ ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని, ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి లాలూ ప్రసాద్ ఇష్టపడలేదని ప్రధాని మోదీ ఆరోపించారు. సరైన భాగస్వామ్య పక్షాలుంటే ప్రతిదీ సాధ్యమేనని పరోక్షంగా నితీశ్‌ను కొనియాడారు. లోక్‌సభలో శుక్రవారం వ్యవసాయ బిల్లులు ఆమోదాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాగతించారు. దళారీల నుంచి రైతులను కాపాడే ఈ సంస్కరణలను విపక్షాలు వ్యతిరేకించడాన్ని ఆయన తప్పుపట్టారు. దళారీలతో పనిలేకుండా రైతులు తమ ఉత్పత్తులను విక్రయించేందుకు ఈ సంస్కరణలు వెసులుబాటు కల్పిస్తాయని చెప్పారు. వ్యవసాయంలో రైతులకు నూతన స్వాతంత్ర్యం లభించిందని ప్రధాని కోసి రైల్ మెగా బ్రిడ్జిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించిన అనంతరం పేర్కొన్నారు. లోక్‌సభలో ఆమోదం పొందిన వ్యవసాయ బిల్లులతో రైతులకు మేలు చేకూరుతుందని చెప్పారు.రైతులు తమ ఉత్పత్తులను మరింత మెరుగ్గా విక్రయించుకనేందుకు అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఈ బిల్లులు దళారీల నుంచి రైతులను రక్షిస్తాయని అన్నారు. ఈ అంశంపై రైతులను పక్కదారి పట్టించేందుకు విపక్షాలు ప్రయత్నించాయని మండిపడ్డారు. దశాబ్దాల తరబడి దేశాన్ని పాలించిన వారు రైతుల సాధికారత కోసం ఏమీ చేయలేదని ఆరోపించారు. రైతుల లాభాలను దోచుకునే దళారీలకు విపక్షాలు సహకరించేలా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కాగా వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా పలు రాష్ట్రాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. పంజాబ్ కాంగ్రెస్ ఎంపీల పార్లమెంట్ ఆవరణలోనే బిల్లు కాపీలను చించివేయగా, ఆ రాష్ట్ర రైతులు ఈనెల 24 నుంచి 26 వరకూ రైల్ రోకోకు పిలుపు ఇచ్చాయి. మరోవైపు వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తూ ఎన్డీయే భాగస్వామ్య పక్షం శిరోమణి అకాలీదళ్‌కు చెందిన కేంద్ర మంత్రి హరిసిమ్రత్ కౌర్ బాదల్ గురువారం తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

ఫ్లోరైడ్ రహితంగా తెలంగాణ: కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రాష్ట్రంలో 967 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలు ఉండేవని మంత్రి కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో మిషన్ భగీరథ పథకం విజయవంతంగా అమలు చేయడంతో రాష్ట్రంలో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలు సున్నాకు చేరుకున్నాయన్నారు. ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారికంగా పార్లమెంట్ సాక్షిగా దృవీకరించిందని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఈ మేరకు కెటిఆర్ ట్వీట్ చేశారు.

ప్రగతి భవన్ వద్ద ఆటోడ్రైవర్ ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): ప్రగతి భవన్ వద్ద శుక్రవారం ఉదయం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేయడంతో కలకలం రేగింది. చందర్ అనే ఆటో డ్రైవర్ ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించకోవడానికి ప్రయత్నించగా అప్రమత్తమైన పోలీసులు అడ్డుకున్నారు. తెలంగాణ వచ్చినా ఉద్యోగాలు లేవు.. డబుల్ బెడ్రూమ్ ఇల్లు ఇవ్వలేదంటూ చందర్ నిరసన తెలిపాడు. తెలంగాణ కోసం 2010లో అసెంబ్లీ వద్ద ఆత్మహత్యాయత్నం చేసుకున్నానని అతను చెప్పుకొచ్చాడు. చందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు కాంగ్రెస్ కిసాన్ విభాగం ప్రగతి భవన్ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అలర్టయ్యారు.

క్రైస్తవ సంస్థల సేవలు మరువలేనివి

ప్రపంచ వ్యాప్తంగా వారు అనేక రంగాల్లో కృషి
ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కెటిఆర్

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): పేద దేశాల్లో క్రైస్తవ మిషనరీలు అందిస్తున్న సేవలు మరువలేనివి అని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రశంసించారు. నగరంలోని బంజారాహిల్స్‌లో బిషప్‌లు, క్రైస్తవ ప్రముఖులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్ సన్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. క్రైస్తవ మిషనరీలు కొన్ని దశాబ్దాలుగా విద్య, వైద్య రంగంలో ఎనలేని కృషి చేస్తున్నారని కొనియాడారు. ఎక్కడ విపత్తులు సంభవించినా సేవలు అందించ డానికి క్రైస్తవ సమాజం ముందు ఉంటుందన్నారు. విపత్తుల వేళ కూడా విశేష సేవా, సహాయం అందిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ హిందూ ధర్మాన్ని బలంగా నమ్ముతారు. అదే సమయంలో ఇతరుల నమ్మకాలను కూడా గౌరవిస్తారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు. స్వరాష్ట్రంలో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందాయన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు వెళ్తున్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థుల కోసం 940 గురుకులాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ గురుకులాల్లో 5 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒక్కో విద్యార్థిపై రూ. 1.20 లక్షలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. క్రైస్తవ సమాజానికి టీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి అనేది సమగ్రంగా, సమ్మిళితంగా ఉండాలనేది తమ అభిమతమని కేటీఆర్ స్పష్టం చేశారు. చైనా కంటే మనం వెనుకబడి ఉన్నామని తెలిపారు. మౌలిక వసతుల కల్పన లేకుండా ఎంత అభివృద్ధి జరిగినా అది వృథా అవుతుందన్నారు. ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ జీఎస్‌డీపీ ఆరేళ్లలోనే రెట్టింపు అయిందన్నారు. తెలంగాణ అద్భుతమైన ప్రగతిని సాధిస్తుందని కేటీఆర్ తెలిపారు. క్రైస్తవుల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం పాటుపాడు తోందని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. వారి కోసం రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. చదువుకొని ఉద్యోగాలు లేని వారికి లోన్లు ఇచ్చి స్వయం ఉపాధి కోసం ఆదుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని క్రైస్తవులు కోరుకున్నారన్నారు. ఈ ఆరేళ్లలో ఎక్కడ చిన్న సమస్య వచ్చినా ప్రభుత్వం వెంటనే స్పందిస్తుంది. అన్ని వర్గాలకు ప్రభుత్వం చేయుతనందిస్తోంది. క్రైస్తవుల స్మశాన వాటిక కోసం స్థలం కూడా కేటాయించి అన్ని సదుపాయాలు ఉండేలా చూస్తాం. కోవిడ్ కారణంగా మరణించిన క్రిస్టియన్ సోదరులను ప్రభుత్వం ఆదుకుంటుంది. ప్రభుత్వ పథకాలను కూడా క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున ప్రచారం చేయాలి. ఈ రాష్ట్రం దేశంలోనే అభివృద్ధిలో మొదటి స్థానంలో ఉంది. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే ఉద్దేశ్యంతో సమూల మార్పులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

హోమియోపతి సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

ఆర్డినెన్స్‌లు తేవడంపై సభ్యుల నిరసన
హోమియోపతి బోధన నాణ్యత, ప్రాక్టీసింగ్‌పై పలువురి అనుమానాలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): హోమియోపతి సెంట్రల్ కౌన్సిల్ (సవరణ) బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. 2019 జూన్‌లో లోక్‌సభలో హోమియోపతి బిల్లు పాసైంది. బిల్లు సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ఆర్డినెన్స్ రాజ్యం చెలామణి అవుతోందని ఎంపీ కేకే రాజేశ్ తన నిరసన వ్యక్తం చేశారు. వ్యవస్థలు, సంస్థల అటానమిని ప్రభుత్వం లాక్కుంటోందని ఎంపీ బివిన్ బోరో ఆరోపించారు. హోమియోపతి బోధన నాణ్యత, ప్రాక్టీసింగ్‌పై ప్రభుత్వం ముందు సవాళ్లు ఉన్నట్లు బీజేపీ ఎంపీ డాక్టర్ సుధాన్షు త్రివేది తెలిపారు. హోమియోపతి

చికిత్సకు శాస్త్రీయ ఆధారం లేదని కొందరంటారని, కేవలం వ్యాధిపై మాత్రమే కాదు, రోగిపైన కూడా హోమియో వైద్యం దృష్టిపెడుతుందన్నారు. దీని వెనుక ఉన్న సైన్స్ కనిపించదని ఎంపీ సుధాన్షు తెలిపారు. బెంగాల్‌కు చెందిన ఎంపీ డాక్టర్ సనాతన్ సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిని ఖండించారు. గోమూత్రం తాగితే వ్యాధులు నయం అవుతాయని ప్రభుత్వమే చెబుతుంటే.. ఇక ఆ ప్రభుత్వం నుంచి ఏం ఆశించగలమని అన్నారు. అర్హత లేని వైద్య విధానాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని ఆరోపించారు. ప్రైవేటు కాలేజీలకు కూడా అక్రమ అనుమతులు ఇస్తున్నట్లు ఆరోపించారు. భారతీయ వైద్య విధానంలో హోమియోపతి పురాతన పద్ధతి అని, ఇది పేదలకు అందుబాటులో ఉంటుందని, ఈ చికిత్సా విధానాన్ని మరింత క్రియాశీలంగా మార్చాలని బీజేపీ ఎంపీ ప్రసన్న ఆచార్య తెలిపారు. ఫెడరల్ స్ఫూర్తిని విఘాత పరిచే విధంగా బిల్లు ఉన్నట్లు డీఎంకే ఎంపీ తిరుచి శివ ఆరోపించారు. అడ్వైజరీ కౌన్సిల్‌లో స్టేట్ మెడికల్ కౌన్సిల్స్ సభ్యుల ప్రాతినిధ్యం లేదన్నారు. ఆర్డినెన్స్ విధానంలో బిల్లును తీసుకురావడాన్ని ఆర్జేడీ ఎంపీ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ తెలిపారు. ఇది ప్రభుత్వం కాదు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ అంటూ ఆయన ఆరోపించారు. బిల్లును బ్యాలెన్స్ చేయాలని, సహకార సమాఖ్య గురించి ప్రధాని మాట్లాడుతున్నా.. కానీ కార్యాచరణ అలా లేదన్నారు. భారతీయ మెడిసిన్ అంటూ మార్కెట్లో అనేక నకిలీ మందులు అమ్ముతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కర్నాటకకు చెందిన కాంగ్రెస్ ఎంపీ

నేటినిజం
శనివారం 19-9-2020

బ్రహ్మోత్సవ శోభకు కరోనా కాటు !

బ్రహ్మోత్సవాలు అంటేనే..శోభ. అదో బ్రహ్మాండమైన ఉత్సవం..మనసు పులకరిస్తుంది. తనువు తేలియాడుతోంది. భగవంతుడు కళ్లముందు నడాయడుతున్నట్లుగా ఉంటుంది. అఖజలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి ఏటా జరిగే ఈ ఉత్సవాల కోసం లక్షలాదిగా భక్తులు తరలి వచ్చి పాల్గొనడం ఆనవాయితీ. ఆ వేడుకలను చూడాలని కోరుకోని వారు ఉండరు. అలాంటి బ్రహ్మోత్సవాలు ఏటేటా ఎంతో వేడుకగా తిరుమలలో నిర్వహిస్తారు. తిరుమల బ్రమ్మోత్సవాలకు ఉన్న ప్రత్యేకత మరెక్కడా కానరాదు. అందుకే ఈ కళ్యాణోత్సవాల్లో పాల్గొనాలని భుక్తులు ఉవ్వీళ్లూరుతారు. కానీ కరోనా నేపథ్యంలో ఇప్పుడా భాగ్యం లేకుండా పోయింది. కలియుగ వైకుంఠనాథుడైన శ్రీవేంకటేశ్వరస్వామికి ఏడాది మొత్తం అనేక ఉత్సవాలు, ఊరేగింపులు, కైంకర్యాలు జరుగుతుంటాయి. వాటిలో అత్యంత ప్రధానమైనది బ్రహ్మోత్సవం. సాక్షాత్తూ బ్రహ్మదేవుడు నిర్వహించినందువల్లే ఈ ఉత్సవాలకు బ్రహ్మోత్సవంగా పేరు వచ్చింది. శ్రీవారు ఆవిర్భవిం చినప్పటి నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతూనే ఉన్నాయి. నిత్యం జరిగే ఏకాంత సేవలోనూ బ్రహ్మ తిరుఆరాధనలో భాగంగా ప్రత్యేకంగా తీర్థాన్ని ఉంచుతారు.ఆ సమయంలో బ్రహ్మదేవుడే వచ్చి స్వామికి ఆరాధన చేస్తారని క్షేత్ర సంప్రదాయాల్లో ఉంది. తాజాగా సాలకట్ల బ్రహ్మోత్స వాలకు ఏర్పాట్లు పూర్త య్యాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొనిఉన్న కరోనా పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నిబంధనలకు అనుగుణంగా బ్రహ్మోత్సవాలను రద్దు చేయకుండా ఏకాంతంగా నిర్వహించాలని నిర్ణయించారు. అయితే గతంలో ఎంతో శోభాయమానంగా జరిగే ఈ ఉత్సవాలు పరిమిత సంఖ్యలో జరపడం సామాన్య భక్తులకు అందుబాటులో లేకపోవడం ఒకింత వెలితిగానే అనిపిస్తోంది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 19 నుంచి 27వ తేదీ వరకు జరుగనున్నాయి. కోవిడ్-19 వ్యాధి వ్యాప్తి నివారణ చర్యల్లో భాగంగా ఈ బ్రహ్మోత్సవాలను ఏకాంతంగా నిర్వహించాలని టిటిడి నిర్ణయించింది. అందుకే ఎక్కడా పెద్దగా హడావిడి కానరావడం లేదు. ఈ సందర్భంగా శ్రీ విష్వక్సేనుల వారిని రంగనాయకుల మండపంలోకి వేంచేపు చేసి అంకురార్పణతో ప్రారంభిస్తారు. వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురా ర్పణం అత్యంత ముఖ్యమైనది. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు అది విజయవంతం కావాలని కోరుతూ స్వామివారిని ప్రార్థించేందుకు అంకురార్పణం నిర్వహిస్తారు. అంకురాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణం అయింది. అదేరోజు రాత్రి బ్రహ్మోత్సవాలకు నవధాన్యాలతో అంకురార్పణం జరుగుతుంది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు శనివారం సాయంత్రం మీన లగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఆ తరువాత రాత్రి పెద్దశేషవాహన సేవ ఉంటుంది. వార్షిక బ్రహ్మోత్సవాలకు, నవరాత్రి బ్రహ్మోత్సవాలకు కొంత వ్యత్యాసం ఉంది. వార్షిక బ్రహ్మోత్సవాలనే ప్రధానంగా పరిగణిస్తారు. నవరాత్రి బ్రహ్మోత్సవాలు కేవలం అలంకార బ్రహ్మోత్సవాలుగా చూస్తారు. తిరుమల శ్రీవారి ఆలయ చరిత్రలో ఇప్పటివరకు బ్రహ్మోత్సవాలను ఏకాంతంగా నిర్వహించినట్టు ఆధారాల్లేవు. బహుశా ఇదే మొదటిసారి అనుకోవచ్చు. అంకురార్పణ నుంచి చివరిరోజు నిర్వహించే చక్రస్నానం వరకు అన్నీ ఆలయంలో ఏకాంతంగా నిర్వహించక తప్పని పరిస్థితి ఏర్పడింది. రంగనాయక మండపం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు, ఉత్సవమూర్తులకు అలంకరణ, స్నపన తిరుమంజన కార్యక్రమాలు జరుగుతా యి. సంపంగి ప్రాకారంలోని కల్యాణమ ండపంలో వాహనసేవలు నిర్వహించా లని ప్రణాళికలు రూపొందించారు. సాధారణంగా బ్రహ్మోత్సవాల్లో వాహనసేవలు ఒక్కొక్కటి రెండుగంటల పాటు జరుగుతుంటాయి. ఈ ఏడాది ఏకాంతంగానే వాహనసేవలు జరగనున్న నేపథ్యంలో కల్యాణ మండపంలో గంట వ్యవధిలోనే వాహనసేవ పూర్తవుతుంది. ఉదయం 9 నుంచి 10, రాత్రి 7నుంచి 8 గంటల మధ్య వాహనసేవ జరుగుతుంది. గరుడసేవకు యథావిధిగా శ్రీవిల్లిపుత్తూరు మాలలు, గొడుగులు శ్రీవారికి అందుతాయి. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవరోజే రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించేవారు. అయితే ఆ రోజు రద్దీ ఉండడంతో బ్రహ్మోత్సవాల తొలిరోజు ధ్వజారోహ ణానికి ఆ సంప్రదాయాన్ని మార్చారు. కానీ ఈ ఏడాది ఉత్సవాలు ఏకాంతంగానే జరుగుతున్న క్రమంలో పూర్వపు సంప్రదాయం ప్రకారం గరుడవాహన సేవ రోజునే ప్రభుత్వం నుంచి పట్టువస్త్రాలు శ్రీవారికి అందను న్నాయి. అయితే ఈ నిర్ణయాలన్నీ ఆగమశాస్త్రానికి అనుగుణంగా తీసుకున్నవే కావడం విశేషం. ఇకపోతే బ్రహ్మోత్సవాల్లో అత్యంత వేడుకగా నిర్వహించే వాహన సేవలు కూడా బోసిపోతున్నాయి. తిరుమాడ వీధుల్లో నిర్వహించే వాహనసేవలన్నీ రద్దు చేశారు. ఇందులో భాగంగానే మహారథం, స్వర్ణరథోత్సవాల ఊరేగింపులు కూడా రద్దయ్యాయి. వాటి స్థానంలో సర్వభూపాల వాహనంలో శ్రీవారి ఉత్సవమూర్తులను కొలువుదీర్చాలని నిర్ణయం తీసుకున్నారు. రథాల్లో ఉత్సవమూర్తులకు నిర్వహించే వైదిక కార్యక్రమాలన్నీ సర్వభూపాల వాహనంలోనూ జరుగుతాయి. సాధారణంగా బ్రహ్మోత్సవాల్లో చివరిరోజు శ్రీవారి పుష్కరిణిలో నిర్వహించే చక్రస్నానాన్ని ఈ ఏడాది శ్రీవారి ఆలయంలోని అయన మహల్‌లో నిర్వహించ నున్నట్లు తెలుస్తోంది. వేకువజామున పల్లకి ఉత్సవం, తిరుచ్చి నిర్వహించి ఆ తర్వాత స్నపన తిరుమం జనం జరిపిస్తారు. పుష్కరిణి నుంచి తీసుకువచ్చిన పవిత్ర జలాలున్న భారీ గంగాళంలో చక్రత్తాళ్వారును ముంచి చక్రస్నాన ఘట్టాన్ని పూర్తిచేస్తాం. ఇలా చేయడం ద్వారా ఆగమానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. అదే రోజు రాత్రి 8 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. మొత్తంగా ఈ యేడాది ఇలా జరగడం వల్ల భక్తులకు శ్రీవారి బ్రహ్మోత్సవాలను వీక్షించే అవకాశం లేకుండా పోతున్నది. ఇకపోతూ తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే ధ్వజారోహణంకు దర్భచాప, తాడు సిద్ధమయ్యాయి. బ్రహ్మోత్సవాల ఆరంభానికి సూచికగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభం మీదకు గరుడ పతాకం ఎగురవేసి ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. రుత్విక్కులు వేద మంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు.దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభం పై వరకు చుడతారు. వీటి తయారీ కోసం టీటీడీ అటవీశాఖ 10 రోజుల ముందునుంచే కసరత్తు చేస్తుంది. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అనే రెండు రకాలు ఉండగా, తిరుమలలో విష్ణు దర్భ ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం వడమాల పేట పరిసర ప్రాంతమైన చెల్లూరు పంటకాలువల మీద పెరిగే ఈ దర్భను టీటీడీ అటవీ సిబ్బంది సేకరించారు. దీన్ని తిరుమలకు తెచ్చి తక్కువ ఎండలో వారం రోజులు ఎండబెట్టి తయారుగా ఉంచారు. ఆ తరువాత దర్భను బాగా శుభ్రపరచి, చాప, తాడు తయారు చేస్తారు. ఈ నెల 19వ తేదీ జరిగే ధ్వజారోహ ణంలో వీటిని ఉపయోగిస్తారు. మొత్తంగా అంతా మొక్కుబడిగా బ్రహ్మోత్సవాలు జరగడం ఇదే తొలిసారి కావచ్చు. మళ్లీ ఇలాంటి పరిస్థితులుమళ్లీ రాకుండా ఉండాలని శ్రీవారిని కోరుకుందాం

వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా 25న భారత్ బంద్

న్యూఢిల్లీ,సెప్టెంబరు18(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా ఈనెల 25న భారత్ బంద్‌కు ఆలిండియా కిసాన్ సంఘర్ష్ సమన్వయ కమిటీ (ఏఐఎస్‌సీసీ) పిలుపునిచ్చింది. పంట ఉత్పత్తులను రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేయకుండా నిరోధిస్తూ ప్రభుత్వం బిల్లులను రూపొందించిందని విమర్శించింది. రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నందుకుగాను దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని ప్రకటించింది. కాగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక బిల్లులకు వ్యతిరేకంగా హర్‌సిమ్రత్ కౌర్ తన కేంద్ర మంత్రి పదవికి గురువారం రాత్రి రాజీనామాచేశారు. దానిని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కూడా ఆమోదించారు. అయితే కౌర్ తన మంత్రిపదవికి రాజీనామాచేస్తూ తీసుకున్న నిర్ణయం ఇప్పటికే చాలా ఆలస్యమైందని కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ (కేఎంఎస్‌సీ) విమర్శించింది. అది ప్రజల ఆగ్రహాన్ని ఏమాత్రం తగ్గించలేదని ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి సర్వన్ సింగ్ పంధేర్ అన్నారు. కేందప్రభుత్వం తీసుకుంటున్న రైతు వ్యతిరేక నిర్ణయాలను శిరోమణి అకాలీదల్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ గ్రహించినట్లయితే పార్లమెంటును గెరావ్ చేయాలన్నారు.

జిఎస్టీ బకాయిలపై కేంద్రం నిర్లక్ష్యం: నామా

న్యూఢిల్లీ,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): కరోనా కాలంలో రాష్ట్రాలు ఆర్థికంగా నష్టపోయాయి. కేంద్రం రాష్ట్రాలను ఆదుకోవాల్సింది పోయి కనీసం ఇవ్వాల్సిన వాటిని కూడా ఇవ్వడం లేదని టీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. జీఎస్టీ, ఐజీఎస్టీ బకాయిలపై 9 ప్రాంతీయ పార్టీల సభ్యులతో కలిసి టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్ అవరణలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంపీ నామా మాట్లాడుతూ... రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయంపై ధర్నా చేసినట్లు చెప్పారు. రాష్ట్రానికి రావాల్సిన రూ. 9 వేల కోట్ల జీఎస్టీ బకాయిలు కేంద్రం వెంటనే చెల్లించాలన్నారు. బకాయిల చెల్లింపుపై వాయిదా తీర్మానం ఇచ్చినట్లు తెలిపారు. సమస్యల ప్రస్తావనకు సమయం ఇవ్వాలని స్పీకర్‌ను కోరామన్న ఎంపీ బకాయిల చెల్లింపుపై పార్లమెంటులో చర్చ కోసం పట్టుబడనున్నట్లు పేర్కొన్నారు.

లక్ష ఇళ్లు చూపే వరకు నగరంలో తిరుగుతా

ఒక్కరోజే 3,428 ఇళ్లను పరిశీలించాం

డబుల్ ఇళ్ల పరిశీలనపై సిఎల్పీ నేత భట్టి

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): లక్ష డబుల్ బెడ్‌రూమ్ ఇల్ల నిర్మాణం జరిగిందని ప్రభుత్వం చెప్పినందున వాటిని మొత్తం చూసే వరకు నగరంలో తన పర్యటన కొనసాగుతుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ప్రకటించారు. అన్ని ఇల్లను చూస్తానని అన్నారు. అలాగే ఎంతమంది పేదవారికి అందినదీ ఆరా తీస్తామని అన్నారు. నగరంలో టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గురువారం మంత్రి తలసాని శ్రీనివాస్ చూపించగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పరిశీలించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కొత్తవాళ్లకు ఇచ్చింది తక్కువేన్నారు. లక్ష ఇళ్లు అంటున్నారు.. ఎక్కడ కట్టారో చూడాలన్నారు. ఇవాళ 3,428 ఇళ్లను పరిశీలించామన్నారు. కొత్తగా 400 మందికి మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇచ్చారని ఆయన తెలిపారు. శుక్రవారం కూడా ఇళ్లను పరిశీలించాలనుకుంటున్నామని చెప్పారు. ఇళ్ల నాణ్యతను క్వాలిటీ విభాగం పరిశీలిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. కాగా హైదరాబాద్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై బుధవారం అసెంబ్లీలో వాడి వేడి చర్చ జరిగిన విషయం తెలిసిందే. లక్ష డబుల్ బెడ్రూం ఇళ్లను చూపాలని అసెంబ్లీలో భట్టి సవాల్ చేశారు. ఆ సవాల్‌ను మంత్రి తలసాని స్వీకరించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 3,428 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పరిశీలించాం. ఉదయం నుంచి ఇళ్లను పరిశీలిస్తున్నాం. 2 లక్షల ఇళ్లలో లక్ష ఇళ్లు పూర్తయ్యాయని మంత్రి చెప్పారు. ఇవాళ నాలుగు చోట్ల తిరిగాం. రేపు ఎల్లుండి ఇళ్లను పరిశీలిస్తాం. మంత్రి తలసాని, మేయర్‌తో కలిసి ఇళ్లను పరిశీలించాం. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల క్వాలిటీపై ఇంజినీరింగ్ బృందం పరిశీలిస్తోంది. మొత్తం ఇళ్లు చూశాక నా నిర్ణయం ప్రకటిస్తా. రాజీవ్ గృహ ల్ప ఇల్లు చాలా ఏళ్లయింది. వాటికి వీటికి తేడా చూడాలని అన్నారు.

జాతీయ జెండాకు అవమానం

-యాదాద్రి ఇవో పై కేసును కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): జాతీయ జెండాను అవమానించారంటూ యాదాద్రి ఆలయ ఈవోపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని రాష్ట్ర హైకోర్టు గురువారం కొట్టేసింది. యాదాద్రి ఈవోపై న్యాయవాది నర్సింగోజు నరేష్ ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేయగా హైకోర్టులో విచారణ జరిగింది. ఆగస్టు 15న జెండా ఎగర వేయకుండా గోడకు అతికించారని పిటిషనర్ వాదించారు. అయితే, జాతీయ జెండా కార్యాలయం లోపల గోడకు అతికించవద్దని చట్టంలో ఎక్కడుందని హైకోర్టు ప్రశ్నించింది. జాతీయ జెండా బయటే ఎగరేయాలని చట్టంలో ఉందా అని సూటిగా ప్రశ్నించింది. కార్యాలయంలో అతికిస్తే జాతీయతను ప్రదర్శించినట్టే కదా అని చెప్పింది. ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయ ఆరోగ్యం ముఖ్యమని హైకోర్టు వ్యాఖ్యానిస్తూ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కొట్టేసింది.

విద్యుత్ షాక్‌తో దంపతుల మృతి

సంగారెడ్డి,సెప్టెంబర్18(నేటినిజం ప్రతినిధి): : జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విద్యుత్ షాక్ తో భార్యభర్తలు మృతి చెందిన ఘటన నారాయణ ఖేడ్ మండలం అంత్వార్ లో జరిగింది. గ్రామానికి చెందిన లక్ష్మణ్(46), స్వరూప(41) భార్యభర్తలు. పొద్దంతా పొలం పనులు చేసి వచ్చిన దంపతులు.. ఇంటి ముందు ఉన్న జియో వైర్ పై బట్టలు ఆరేస్తుండగా ప్రమాదం సంభవించింది. నాలుగు రోజులుగా ఇంటికి షాక్ వస్తుందని చెప్పినా విద్యుత్ సిబ్బంది పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దుబ్బాకలో దూకుడు పెంచిన హరీష్ రావు

అన్నీ తానై పార్టీని నడిపిస్తున్న మంత్రి

ప్రచారంలో దూసుకుపోతున్న బిజెపి నేత రఘునందన్

స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగుతున్న కత్తి కార్తీక

సిద్దిపేట,సెప్టెంబరు18(ఆర్ఎన్ఎ): త్వరలో జరిగే దుబ్బాక ఉప ఎన్నికలో అంతా తానే అయి మళ్లీ మంత్రి హరీష్ రావు చురుకుగా పాల్గొంటున్నారు. ఏ చిన్న కార్యక్రమం అయినా హరీష్ రావు ప్రత్యక్షం అవుతున్నారు. తనకు సిద్దిపేట ఎంతో దుబ్బాక కూడా అంతే అని చెబుతున్నారు. అధికార పార్టీలో ఇంకో ప్రశ్నకు తావు లేకుండా పరిస్థితులను అనుకూలంగా మలుచుకోవాలని అనుకుంటున్నారు. ఈ కోవలోనే దుబ్బాకలో మంత్రి హరీష్‌రావు విస్తృతంగా పర్యటనలు చేస్తూ అనేక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

దుబ్బాక ఉప ఎన్నిక షెడ్యూల్ రాకపోయినా.. త్వరలోనే ఎలక్షన్ వస్తుందనే అంచనాలతో పార్టీలు దూకుడు పెంచాయి. టీఆర్ఎస్ నుంచి రామలింగారెడ్డి భార్య సుజాతకు టికెట్ ఇవ్వడం దాదాపుగా ఖాయమైందని అంటున్నారు. ఇక్కడ టీఆర్ఎస్ గెలుపు బాధ్యతలను మంత్రి హరీష్‌రావుకు అప్పగించింది పార్టీ. దీంతో నియోజకవర్గంలో ఆయన పలు దఫాలుగా పర్యటించి అందరితో మాట్లాడుతున్నారు. పార్టీలోని అసంతృప్తులను బుజ్జగించి దారికి తెచ్చుకుంటున్నారు. హరీష్‌రావుకు సైతం దుబ్బాకపై మంచి పట్టుఉంది. ఆయన పక్క నియోజకవర్గం సిద్దిపేట నుంచే గెలుపొందడంతో ఇక్కడేం జరుగుతుందో మరొకరు చెప్పాల్సిన అవసరం లేదు. దివంగత ఎమ్మెల్యే రామలింగారెడ్డి, హరీష్‌రావుకు మధ్య స్నేహం కూడా ఉంది. ఉద్యమంలో ఇద్దరూ చురుకుగా పనిచేశారు. అలాగే పార్టీ కూడా దుబ్బాక టికెట్ రామలింగారెడ్డికి తప్ప మరొకరికి ఇవ్వలేదు. ఆయన ఐదుసార్లు పోటీ చేస్తే నాలుగుసార్లు గెలుపొందారు. అందుకే దుబ్బాక ఉప ఎన్నికలో టీఆర్ఎస్ గెలుపు బాధ్యతలను మంత్రి హరీష్‌రావు తీసుకున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో సిద్దిపేట, దుబ్బాక జోడెద్దులని ప్రకటించి.. కేడర్‌లో ఉత్సాహం తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. హరీష్‌రావు దూకుడు గమనించిన విపక్ష పార్టీలు.. మంత్రిని లక్ష్యంగా చేసుకుని విమర్శలు మొదలుపెట్టాయి. సిద్దిపేటను అభివృద్ధి చేసినట్లు దుబ్బాకను ఎందుకు డెవలప్ చేయలేదని ప్రశ్నలు సంధిస్తున్నాయి. లెక్కలు బయటపెడుతున్నారు నాయకులు. ఫేస్ వాల్లది బేస్ హరీష్‌రావుది అని మాటల తూటాలు పేలుస్తున్నాయి. దుబ్బాకలో టీఆర్ఎస్ గెలిస్తే.. పరాయి పెత్తనం తప్పదని విపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో హరీష్‌రావు కొందరు సర్పంచ్‌లకు ఫోన్లు చేసి మంచిచెడ్డలు ఆరా తీశారు. అయితే ఎవరెన్ని విమర్శలు చేసినా.. హరీష్‌రావు తనకు అప్పగించిన పనిని చేసుకుంటూ వెళ్లిపోతున్నారు. పైగా హరీష్‌కు ఏ బాధ్యత అప్పగించినా తూచా తప్పకుండా పూర్తి చేస్తారని.. విజయం సాధిస్తారని పార్టీలో గట్టి నమ్మకం ఉంది. అధినేతకు కూడా అదే నమ్మకం ఉంది. మొత్తానికి ఉప ఎన్నిక నోటిఫికేషన్ రాకుండానే దుబ్బాక రాజకీయం వేడెక్కడంపై జనాల్లోనూ ఆసక్తికర చర్చ మొదలైంది. మరోవైపు రాజకీయ పార్టీలు అధికారికంగా తమ అభ్యర్థులను ప్రకటించకముందే దుబ్బాక నియోజకవర్గంలో ప్రచారం ముమ్మరమైంది. ఎవరికివారే అన్నట్లుగా ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటివరకు ఏ పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించకున్నా స్థానికంగా మాత్రం రాజకీయ సందడి నెలకొన్నది.

అధికార పార్టీ టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను, పార్టీ ముఖ్యులను మోహరించారు. అన్ని మండలాలకు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను ఇన్‌చార్జులుగా నియమించారు. దుబ్బాక మండలానికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, చేగుంట మండలానికి నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నార్సింగి మండలానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, తొగుట మండలానికి అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, రాయపోల్ మండలానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, దౌల్తాబాద్ మండలానికి ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతా?పరెడ్డి, మిరుదొడ్డి మండలానికి సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతాప్రభాకర్‌కు ఇన్‌చార్జిగా బాధ్యతలను అప్పగించారు. సిద్దిపేట, గజ్వేల్ మున్సిపాలిటీల కౌన్సిలర్లతోపాటు సిద్దిపేట, గజ్వేల్, మెదక్ నియోజకవర్గాల సర్పంచులతోపాటు పక్కనే ఉన్న రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్, గంబీర్‌రావుపేట మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులకు గ్రామాల వారీగా బాధ్యతలను అప్పగించారు. వారంతా మొదట గ్రామాల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. అంతేగాక గ్రామాల్లో అసమ్మతులను బుజ్జగించే పనిని నెత్తికెత్తుకున్నారు. మంత్రి హరీశ్‌రావు సైతం పలువురు సర్పంచులకు ఫోన్ చేసి ఆయా గ్రామాల్లో పరిస్థితులను తెలుసుకుంటున్నారు. అయితే పలుచోట్ల టీఆర్ఎస్ పార్టీపై, ముఖ్యనేతల తీరుపై ప్రతికూలత కనిపిస్తున్నదనే విమర్శలున్నాయి. దుబ్బాక నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఇంటింటి ప్రచారంలో ప్రతిగడప చుట్టేసి, అభ్యర్థి తానే అయ్యి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్‌రావు ప్రచారం సాగిస్తున్నారు. అధికారికంగా బీజేపీ పార్టీ తమ అభ్యర్థిని ప్రకటించకపోయినప్పటికీ, నియోజకవర్గంలోని సుమారు 80 శాతం గ్రామాలను ఇప్పటికే ఆయన పూర్తి చేశారు. నిజామాబాద్, కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల ఫార్ములాను అవలంబిస్తున్నారు. యువతను రంగంలోకి దింపి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని విస్తృతం చేస్తున్నారు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థి నాయకులు, పార్టీ శ్రేణులు, సంఘ్‌పరివార్ కార్యకర్తలు ఇంటింటా తిరిగి ప్రచారం చేస్తున్నారు. ప్రతి ఎన్నికకు కాంగ్రెస్ కొత్తముఖం తెరపైకి రావడంతో ఆపార్టీని ఇన్నాళ్లు పట్టించుకున్న నాథుడు లేకుండా పోయారు. ఇదే క్రమంలో ఆ పార్టీలో చేరిన వెంకటనర్సింహారెడ్డి కార్యకలాపాలను సాగిస్తున్నారు. ఆయనతో పాటు నాయకులు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, నర్సారెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నట్లు తెలిసింది. ప్రచారం మాత్రం ఇప్పటికీ మొదలు పెట్టలేదు. ఆపార్టీ నాయకులు తమ గ్రూపులను సమీకరించి గాంధీభవన్‌కు మాత్రం తిరుగు తున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగాలనుకున్న టీవీ యాంకర్ కత్తి కార్తీక మాత్రం గ్రామాలను చుట్టేస్తున్నారు. కుల సంఘాల నాయకులను, వివిధ వర్గాలను కలిసి మద్దతు అడుగుతున్నారు. పది మంది యువకులున్న ప్రతి చోట తానే సెల్ఫీలు దిగి హల్‌చల్ చేస్తున్నారు. తనను ఆదరించాలని కోరుతున్నారు.

సన్నరకం దిగుబడులు పెరిగే ఛాన్స్

నియంత్రిత సాగుతో సన్నాలు పెరిగిన ప్రాధాన్యం

మెదక్,సెప్టెంబరు18(ఆర్ఎన్ఎ): జిల్లాలో వ్యవసాయాధికారులు సన్నరకం వరి ధాన్యం సాగు చేసేలా రైతులను ప్రోత్సహించారు. ఫలితంగా ఎన్నడూ లేని విధంగా లక్షా 20 వేల ఎకరాల విస్తీర్ణంలో సన్నరకం వరి సాగు చేశారు. ప్రభుత్వం ఏ-గ్రేడ్ రకానికి మద్దతు ధర నిర్ణయించినా ఇప్పటివరకు సన్నరకం వరి ధాన్యానికి మద్దతు ధర ప్రకటించలేదు. దీంతో అన్నదాతల్లో ఒకింత సందిగ్ధం నెలకొన్నది. కరోనా నేపథ్యంలో రైతుల నుంచి అధికారులు ధాన్యం కొనుగోలు చేయడం కొంత ఇబ్బందికరంగానే ఉంటుంది. జిల్లాలో అన్ని పట్టణాలు, గ్రామాల్లోనూ కరోనా కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ధాన్యం కొనుగోలులో రద్దీని నివారించేందుకు 205 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికార యంత్రాంగం యోచిస్తున్నది. ఐకేపీ ఆధ్వర్యంలో 85, సహకార సంఘాల ఆధ్వర్యంలో 120 కేంద్రాల ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం ఇటీవల ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్ణయించింది. పరిస్థితులను బట్టి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరింత పెంచేందుకు కూడా వెనుకాడబోమని అధికారులు తెలిపారు. వరి కోతలు ప్రారంభమైన వెంటనే రైతుల నుంచి వెంటవెంటనే కొనుగోలు చేసేందుకు ముందస్తు ప్రణాళికలు చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులకు అనుసంధానంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.ధాన్యం సేకరణ లక్ష్యం మేరకు 3.34 లక్షల మెట్రిక్ టన్నులకు గాను 83 లక్షల గోనెసంచులు అవసరమవుతాయి. గత సీజన్‌లో రైస్‌మిల్లులకు ఇచ్చిన 25 లక్షల గోనె సంచులను సేకరిస్తామని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఇవేగాక గోదాముల్లో మరో 15 లక్షల వరకు గోనె సంచులు ఉంటాయి. మిగతా 43 లక్షల గోనె సంచులను కొనుగోలు చేయనున్నారు. రైస్‌మిల్లర్లు ఎవరైనా గోనెసంచులను తిరిగి ఇవ్వలేకపోతే ఒక్కో సంచికి రూ.37 చొప్పున వసూలు చేస్తామని తెలిపారు. ఇక రైతులు తెచ్చిన ధాన్యం వర్షానికి తడవకుండా కేంద్రానికి 20 చొప్పున టార్పాలిన్లు అందుబాటులో ఉంచనున్నారు. ధాన్యం తూకం వేయడానికి యంత్రాలు, ధాన్యం శుద్ధి యంత్రాలు, తేమను కొలవడానికి మాయిశ్చర్ మిషన్లను రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు.

నియంత్రిత సాగు విధానంతో జిల్లాలో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. గత సీజన్‌తో పోలిస్తే యాభై శాతం అధికంగా.. అంటే లక్షా 60 వేల ఎకరాల్లో వరి సాగవుతున్నది. దీంతో దిగుబడి కూడా భారీగా పెరిగే అవకాశముంది. మరో నెల రోజుల్లో ధాన్యం చేతికి రావడమే కాకుండా విక్రయాలు ప్రారంభమవుతాయి. ఈ నేపథ్యంలో జిల్లా రైతుల నుంచి 3.34 లక్షల మెట్రిక్ టన్నుల పరిధాన్యం సేకరించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వ్యవసాయ శాఖతో పాటు మార్కెటింగ్, పౌర సరఫరా, రవాణా, డీఆర్డీఏ, ఎఫ్‌సీఐ, సీడబ్ల్యూసీ విభాగాల అధికారులు అందుకనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా 205 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభించారు.

రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

వరంగల్ రూరల్,సెప్టెంబర్18 (ఆర్ఎన్ఎ): కాశిబుగ్గ - ఆత్మకూరు డబుల్ ర

మరకుగా అమరవీరుల స్థూపం పనులు

పరిశీలించిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): నగరం నడిబొడ్డున తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపాన్ని నిర్మిస్తున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. లుంబినీ పార్కు వద్ద కొనసాగుతున్న తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం నిర్మాణ పనులను మంత్రి ప్రశాంత్ రెడ్డి శుక్రవారం ఉదయం పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ అమరవీరుల స్మారక స్థూపం నిర్మించాలని సీఎం కేసీఆర్ తలపెట్టారు. దీంతో నగరం నడిబొడ్డున 28 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అమరవీరుల స్మారక స్థూపాన్ని నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు.

రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర కేబినెట్‌తో పాటు ఇతర దేశాల ప్రముఖులు రాష్ట్రానికి లేదా హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో ఈ అమరవీరుల స్మారకం వద్ద శ్రద్ధాంజలి ఘటించేలా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విదేశాల ప్రముఖులు ఢిల్లీకి వచ్చినప్పుడు.. అక్కడున్న స్వాతంత్ర సమరయోధుల సమాధులకు ఎలాగైతే నివాళులర్పిస్తారో.. అదే సంప్రదాయాన్ని ఇక్కడ కూడా కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్మారకంలో ఆర్ట్ గ్యాలరీ, వీడియో గ్యాలరీతో పాటు లైబ్రరీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నిర్మాణ పనులు రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయని మంత్రి ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

పేద మహిళలకు అండగా కల్యాణలక్ష్మి

-చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే వనమా

భద్రాద్రి కొత్తగూడెం,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): పేదలకు కొండంత అండగా కల్యాణలక్ష్మి పథకం నిలుస్తుందని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వర్ రావు అన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో కొత్తగూడెం టౌన్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలంలోని 105 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు సుమారు కోటి రూపాయల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుపేద ఆడబిడ్డల పెండ్లింద్లు భారం కావొద్దనే సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వీటితో వారికి భరోసా నిలిచిందన్నారు. సిఎం కెసిఆర్ ప్రతి పథకం పేదల గురించి ఆలోచించ చేపడతారని అన్నారు.

రైతు ప్రయోజనాల కోసం సీఎం కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టానికి శ్రీకారం చుట్టారని అన్నారు. వీఆర్వో వ్యవస్థ రద్దుపై హర్షిస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్నారని అన్నారు. ప్రతిపల్లలో నేడు ప్రజలు సీఎం కేసీఆర్ నిర్ణయం పట్ల హర్షధ్వానాలు చేస్తున్నారన్నారు. కొత్త రెవెన్యూ చట్టం ద్వారా రైతుల భూములకు రక్షణ కల్పించేందుకు ఈ చట్టాన్ని అమలుపరిచారన్నారు. నాటి నుంచి నేటి వరకు రెవెన్యూ వ్యవస్థ వల్ల రైతాంగం అనేక ఇబ్బందులకు దారి తీసిందన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకొని అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఆర్ఎస్ నాయకుడు వనమా రాఘవేంద్ర రావు, జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంత రావు, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి కాపు సీతాలక్ష్మి, ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోనా, విజయలక్ష్మి, జెట్పీటీసీ బిందు చౌహాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ టిక్కెట్లు ఉంటేనే బ్రహ్మోత్సవాలకు అనుమతి

ప్రముఖుల రాకతో భారీగా భద్రతా ఏర్పాట్లు

తిరుమల,సెప్టెంబరు18(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 19 నుంచి ఏకాంతంగా జరుగుతున్నందున.. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో టికెట్లు పొందిన భక్తులే కొండకు రావాలని టీటీడీ సీవీఎస్వో గోపినాథ్‌జెట్టి కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల భద్రత, ప్రముఖుల పర్యటన ఏర్పాట్లకు ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. పెరటాసి మాసంలో తమిళనాడు నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముందన్నారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్‌లో సర్వదర్శన టోకెన్లు తాత్కాలికంగా రద్దయ్యాయని, ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లు బుక్ చేసుకునే తిరుమలకు రావాలని తమిళనాడు లోనూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్టు చెప్పారు. ప్రముఖుల పర్యటనలో తిరుపతి అర్బన్ పోలీసులతో కలిసి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడతామన్నారు. టీటీడీకి సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న 49 ఆలయాలు, విద్యాసంస్థలు, హాస్టళ్లు, కల్యాణమండపాల వద్ద భద్రతా ఏర్పాట్లపై సమీక్షించామన్నారు. టీటీడీ ఆలయాల్లోని 20 ఆలయాల్లో బంగారు, చెక్కరథాల వద్ద భద్రతకు సిబ్బందికి విధులు కేటాయించడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు చేపడతామన్నారు. టెక్నాలజీతో టీటీడీ ఆస్తులను పరిరక్షించుకుంటామన్నారు. 'అంతర్వేది'లో రథం దగ్ధం ఘటన నేపథ్యంలో టీటీడీ పరిధిలోని ఆలయాలు, మఠాల వద్ద భద్రతా ఏర్పాట్లకు ప్రాధాన్యం ఇస్తున్నామని తిరుపతి అర్బన్ ఎస్పీ రమేష్‌రెడ్డి తెలిపారు. అర్బన్ పరిధిలోని దాదాపు 646 ఆలయాల వద్ద భద్రతకు జాగ్రత్తలు తీసుకున్నట్టు చెప్పారు. మతసామరస్యానికి, ప్రశాంతతకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్రహ్మోత్సవాలకు వీఐపీలు ఎవరు వస్తారనే సమాచారం లేదని, ఎవరైనా వచ్చినప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లింగ్‌పై కరోనా ప్రభావం

శేషాచలం అడవుల్లో తగ్గిన స్మగ్లర్ల అలజడి

టాస్క్‌ఫోర్స్ పోలీసులకు తగ్గిన పనిభారం

తిరుపతి,సెప్టెంబరు18(ఆర్ఎన్ఎ): కరోనా కష్టకాలంలో ఎర్రచందనం స్మగ్లర్ల రాకపోకలు కూడా తగ్గాయని భావిస్తున్నారు. శేషాచలం అడవుల నుంచి గత పదేళ్ల కాలంలో లక్ష కోట్ల విలువైన ఎర్రచందనం అక్రమ రవాణా జరిగిందనేది ఒక అంచనా. అప్పట్లో అడవుల్లో స్మగ్లర్లకు, అటవీ సిబ్బందికి, పోలీసులకు మధ్య రాళ్ల దాడులు, ఆత్మరక్షణ కోసం గాలిలోకి కాల్పులు వంటివి జరిగేవి. స్మగ్లర్ల ఛేజింగ్ సీన్లు క్లైం స్టోరీలను తలపించేవి. ఈ క్రమంలోనే ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు గత ప్రభుత్వం రెడ్ శాండర్స్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఐజీ స్థాయి అధికారిని ఈ టాస్క్‌ఫోర్స్‌కు ఇంఛార్జ్‌గా నియమించింది. ఒకేసారి 20 మందిని ఎన్‌కౌంటర్ చేయడంతో ఈ టాస్క్‌ఫోర్స్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగి పోయింది. అయితే కరోనా నేపథ్యంలో రవాణా సౌకర్యాలు లేకపోవడంతో పాటు,పోలీసుల గస్తీ పెరగడంతో వారి రాక తగ్గిందని భావిస్తున్నారు. అడవుల్లోకి స్మగ్లర్లు కూడా పెద్దగా సంచరించినట్లు దాఖలాలు కానరావడం లేదు. ఒకప్పుడు కేసులు మీద కేసులు, రాళ్ల దాడులు. తుపాకీ కాల్పులతో నిత్యం శేషాచలం అడవులు వార్తల్లో నిలిచేవి. అయితే టాస్క్‌ఫోర్స్ ఐజీ కాంతారావును గత ఏడాది జులై 29న ప్రభుత్వం బదిలీ చేసింది. ఇన్నాళ్లూ ఇంఛార్జ్‌గా ఉన్న ఎస్పీ రవిశంకర్ సైతం గత నెల 27న బదిలీ అయ్యారు. ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో నడవాల్సిన టాస్క్‌ఫోర్స్‌కు ఇప్పుడు డీఎస్పీ స్థాయి అధికారే దిక్కయ్యారు. అయితే పరిస్థితిని అవకాశంగా మలుచుకున్న పాత బడా స్మగ్లర్ మళ్లీ యాక్టివ్ అయినట్లు సమాచారం. రాయలసీమకు చెందిన ఓ కీలక నేత, చిత్తూరు జిల్లాకు చెందిన మరికొందరు చురుకుగా ఉన్నారని ప్రచారం సాగుతోంది. ఒకప్పుడు స్మగ్లర్లుగా ఉన్నవారిలో చాలా మంది రాజకీయ నేతలుగా.. ప్రజాప్రతినిధులుగా మారిపోయారు. దీంతో ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకునే టాస్క్‌ఫోర్స్‌కు ... ఫోర్స్ తగ్గిందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లాలోని ఎర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు, చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లో స్మగ్లర్లుగా ముద్రపడ్డవారు రాజకీయాల్లో యాక్టివ్‌గా ఉన్నారట. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే చాలా మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు అవుతారట. ఫలితంగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ఎర్రచందనాన్ని స్మగ్లింగ్ చేస్తుంటే వదిలిపెట్టేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో పోలీసులకు ఇన్ఫార్మర్లుగా ఉన్న సరిహద్దు పొలాల రైతులు, కూలీలు, గొర్రెలు, పశువులను మేపుకొనేవారిని స్థానిక నేతలు కట్టడి చేస్తున్నారు.దీంతో ఎర్రచందనం స్మగ్లింగ్‌పై టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి ఎలాంటి సమాచారం అందడం లేదు. పీలేరు కేంద్రంగా ఉండే అటవీశాఖ ప్లయింగ్ స్క్వాడ్‌కు పనే లేకుండా పోయింది.

ఔటర్ రింగ్‌రోడ్డుపై విరిగిపడ్డ కొండచరియలు

హైదరాబాద్,సెప్టెంబర్17(ఆర్ఎన్ఎ): ఔటర్ రింగ్ రోడ్డుపై రాజేంద్రనగర్ ఎగ్జిట్-16 సమీపంలో గురువారం మధ్యాహ్నం కొండచరియలు విరిగిపడ్డాయి. రెండు రోజులుగా నిరంతరాయంగా కురుస్తున్న వర్షాల కారణంగా ఓఆర్?ఆర్‌పై కొన్ని చోట్ల ఉన్న కొండ చరియలు విరిగి రోడ్డుపై పడ్డాయి. సమాచారం అందుకున్న హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్, ఓఆర్ఆర్ అధికారులు అక్కడికి చేరుకుని వాహనాలను మళ్లించారు. కొండచరియలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

భార్యను హత్యచేసిన కేసులో భర్తకు జీవితఖైదు

కరీంనగర్, సెప్టెంబర్ 18 (నేటినిజం ప్రతినిధి): భార్యను హత్యచేసిన కేసులో భర్తకు జీవితఖైదు, జరిమాన విధిస్తూ గురువారంనాడు కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్‌జడ్జి అనుపమ చక్రవర్తి తీర్పునిచ్చారు. వివరాలు ఇలాఉన్నాయి.

నిజామాబాద్‌జిల్లా నవీపేటకు చెందిన గుర్రాల లక్ష్మన్(36)కు కరీంనగర్‌లోని హుస్సేనిపురా ప్రాంతానికి చెందిన శశికల(28)తో 2015 జనవరి 30న వివాహం జరిగింది. అనంతరం భార్యాభర్తలు కరీంనగర్‌లోని విద్యానగర్‌లో అద్దెకుఉంటున్నారు. భార్యపై వివిధరకాల అనుమానాలను వ్యక్తంచేస్తూ పుట్టింటికి పంపేవాడు. మళ్ళీపెద్దల సమక్షంలో మాట్లాడుకుని భార్యను కాపురానికి తెచ్చుకునేవాడు. ఇలా పలుమార్లు జరిగింది. 2017 ఏప్రిల్ 15న భర్త గుర్రాల లక్ష్మన్ భార్య శశికలను తాడుతో ఉరివేసి హత్యచేసి తనపై అనుమానం రాకుండా ఉండేందుకు ఆమెకు సంబందించిన బంగారు,వెండి ఆభరణాలను ఎత్తుకెళ్ళాడు. మరునాడు ఉదయం తనకు ఏమీతెలియనట్లుగా ఇంటియజమానులకు ఫోన్‌చేసి తనభార్యతో మాట్లాడించమని కోరాడు. దీంతో ఇంటియజమానులుగదిలోకి వెళ్ళేసరికి ఆమె హత్యగావించబడిన శ్యాన్ని చూసి భర్తతోపాటుగా హుస్సేనీపురాలో ఉంటున్న తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అనుమానాస్పదంగా ఉన్న ఈ సంఘటనపై ఫిర్యాధును స్వీకరించి కరీంనగర్ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నాణ్యతప్రమాణాలతో కేసు దర్యాప్తును కొనసాగించిన పోలీసులు పటిష్టమైన సాక్షాధారాలతో కోర్టులో ప్రవేశపెట్టారు. కేసులోని పుర్వాపరాలను పరిశీలించిన జడ్జి గురువారంనాడు భర్తే ప్రధాన నిందితుడిగా నిర్ధారిస్తూ అతడికి జీవితఖైదు, 12వేలరూపాయల జరిమాన విధించారు.

నిందితుడు శిక్షింపబడటంలో కీలకపాత్రపోషించిన న్యాయస్థానం అధికారులు, సంబంధిత పోలీసు అధికారులను కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అభినందించారు.

తెలంగాణ పోరాట స్ఫూర్తితోనే ప్రగతిశీల పాలన

ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): సెప్టెంబర్ 17న తెలంగాణ విలీన దినాన్ని పురస్కరించుకొని నాటి పోరాటాలను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ స్మరించుకున్నారు. నిజాం రాచరిక, జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా తెలంగాణ విముక్తి కోసం వీరోచిత పోరాటాలు చేసిన పుణ్యభూమి తెలంగాణ ప్రాంతం అని వినోద్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ పోరాటాల స్ఫూర్తితోనే రాష్ట్రంలో ప్రగతిశీల పాలన సాగుతోందని ఆయన అన్నారు. గురువారం తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా మంత్రుల అధికారిక నివాసంలో పలు జిల్లాల నుంచి తొలితరం తెలంగాణ ఉద్యమకారులు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు వినోద్ కుమార్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ విలీన పోరాటాలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకుని వచ్చి, లక్షలాది మందికి భూ సమస్యల నుంచి రాష్ట్ర ప్రభుత్వం విముక్తి కలిగించిందని పేర్కొన్నారు. కొత్త రెవెన్యూ చట్టంతో చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. భూమి సమస్యలు తొలిగిపోయి 97 శాతం మంది చిన్న, సన్నకారు రైతులు భూ హక్కులు పొందడం తెలంగాణ పోరాటాల ఫలితమేనని ఆయన వివరించారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని అందిస్తూ లక్షలాది ఎకరాల భూమిని సస్యశ్యామలం చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ విలీన దినోత్సవ స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ విలీన పోరాటాల ఉద్యమ నేపథ్యం గురించి వినోద్ కుమార్ వివరించారు.

కరోనా ఆర్థిక సంక్షోభం మరో ఐదేళ్లు

-ప్రపంచ బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్త కార్మెన్ రీన్‌హర్ట్

మాడ్రిడ్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ సంక్షోభం నుంచి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు ఐదేళ్ల సమయం పట్టొచ్చని ప్రపంచ బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్త కార్మెన్ రీన్‌హర్ట్ అన్నారు. అన్ని దేశాలు ఈ సంక్షోభంలో కూరుకుపోయాయని అన్నారు. గురువారం స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో ఆమె ప్రసంగించారు. ప్రస్తుతం గత 20 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా ప్రపంచంలో పేదరికం శాతం పెరిగిందని అన్నారు. కరోనా కారణంగా చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలు బాగా దిగజారిపోయాయని ఆమె సమావేశంలో వెల్లడించారు. 'కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు విధించిన లాక్‌డౌన్ నిబంధనలను పూర్తిగా ఎత్తివేయడం ద్వారా వెంటనే ఆర్థిక వ్యవస్థలు కొంత మేర పుంజుకోవచ్చు. కానీ, పూర్తి స్థాయిలో ఆర్థిక వ్యవస్థ తిరిగి పురోగతి సాధించాలంటే మాత్రం ఐదేళ్ల సమయం పడుతుంది. కొవిడ్-19 వల్ల ఏర్పడిన ఆర్థిక మాంద్యం ప్రభావం ఇతర దేశాలతో పోలిస్తే కొన్ని దేశాల్లో ఇంకా కొంత కాలం ఎక్కువ ఉంటుంది. ధనిక దేశాల కంటే పేద దేశాలు తీవ్రంగా దెబ్బతింటాయి. అంతేకాకుండా అసమానతలు కూడా పెరుగుతాయి. గత 20 ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా ప్రపంచ పేదరికం స్థాయి పెరిగింది'అని రీన్‌హర్ట్ వెల్లడించారు.

ప్రజలకు అందుబాటులోకి మెరుగైన వైద్యసేవలు

గ్రామీణ పేదప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

అక్బర్‌పేటలో గెస్ట్‌హౌజ్, అంబులెన్సులకు మంత్రి ప్రారంభం

సిద్దిపేట,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): నిత్యం ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. జిల్లాలోని మిరుదొడ్డి మండలం అక్బర్ పేట గ్రామంలో నూతనంగా నిర్మించిన గెస్ట్ హౌస్- అతిథి గృహంతో పాటు, నూతన అంబులెన్స్‌ను శుక్రవారం మంత్రి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ మాట్లాడుతూ..దుబ్బాక నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండేలా మరో రెండు నూతన అంబులెన్సులను మండలంలోని భూంపల్లి గ్రామంలో ప్రారంభించనున్నామని తెలిపారు.గ్రామీణ పేద ప్రజల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నదని పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఇప్పటికే 2 అంబులెన్సులు ఉన్నాయని, స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు మరో రెండు అంబులెన్సులను నూతనంగా ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలు అత్యవసర సమయంలో 108 ను సద్వినియోగం మురుగు కాల్వల స్థానంలో నూతనంగా చేసుకోవాలని మంత్రి హరీశ్ రావు ఆర్‌సీసీ మురుగు కాల్వలను నిర్మించేందుకు సూచించారు. ప్రజల కష్టాలను గుర్తించిన ప్రతి వార్డుకు రూ.10 లక్షలు కేటాయించావ సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని విధంగా ఽన్నారు. నియోజకవర్గంలోని లక్షా 30 వేల సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఎకరాలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు ముఖ్యమంత్రి రైతుల ఇబ్బందులు చూసి నీరందించేందుకు ఆరు నెలల్లో పిల్ల కాల్వల రాష్ట్రంలో కరెంటు పోకుండా కృషి చేస్తే, నిర్మాణ పనులు పూర్తి చేసి చెరువులు, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం బోరు మోటర్లకు కుంటలు నింపుతామని మంత్రి చెప్పారు. కరెంటు మీటర్లు పెట్టడానికి పార్లమెంట్‌లో బిల్లు పెడితే రైతులకు ఇబ్బందులు తప్పవని బిల్లుకు వ్యతిరేకంగా సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఎమ్మెల్యే రామలింగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషిచేశారన్నారు. దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఇప్పటికే రూ.35 కోట్ల నిధులను మంజూరు చేశారన్నారు. వాటితో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయన్నారు. పట్టణంలో చిన్నచిన్న గల్లీలను పెద్దవిగా చేయడం, పాత బస్తీలో రైతులకు ఇబ్బందులు తప్పవని నియోజకవర్గ ప్రజలకు తీరని లోటన్నారు. ఆయన హయాంలో నిర్మించిన 800 డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులైన లబ్దిదారులకు అందజేస్తామన్నారు. సీఎం కేసీఆర్ చదువుకున్న బడి నిర్మాణం కూడా పూర్తి కావడంతో ఆ బడిని సైతం రామలింగారెడ్డి కోరిక మేరకు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలో 56,906 ఆసరా పింఛన్లు చెప్పారు. వీరిలో 20 వేల మంది బీడీ కార్మికులకు జీవనభృతిని ఇస్తున్నామన్నారు. మున్సిపాలిటీలో కొత్తగా 1300 పింఛన్లు ఈ నెల నుంచే ఇస్తున్నామన్నారు.

సిద్దిపేట తరహాలో దుబ్బాక నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు నేనే బాధ్యత తీసుకుంటానని మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు. దుబ్బాక, సిద్దిపేట తనకు రెండు కండ్లన్నారు. పట్టణంలో జంక్షన్ల నిర్మాణంతో పాటు రూ. 4 కోట్లతో టౌన్ హాల్‌ను నిర్మిస్తామన్నారు. వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రామసముద్రం చెరువును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో పంచాయతీ భవనాల నిర్మాణాలకు త్వరితగతిన అనుమతులు వచ్చేలా ప్రత్యేక చొరవ తీసుకున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఒక్కో పంచాయతీ భవనానికి రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఉదయ్‌పూర్ లక్ష్మీవిలాస్ హోటల్‌పై సిబిఐ విచారణ

అతి తక్కువ బిడ్డుకు హోటల్‌ను కట్టబెట్టడంపై మండిపాటు

కేంద్రమాజీమంత్రి అరుణ్ శౌరికి నోటీసులు జారీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): రాజస్థాన్ ఉదయపూర్‌లోని లక్ష్మి విలాస్ ప్యాలెస్ హోటల్‌లో పెట్టుబడులు పెట్టడంపై జరిగిన అవినీతి కేసులో కేంద్ర మాజీ మంత్రి అరుణ్ శౌరీని ప్రత్యేక సీబీఐ కోర్టు నిందితుడిగా పేర్కొన్నది. అరుణ్ శౌరీతోపాటు మాజీ బ్యూరోక్రాట్ ప్రదీప్ బైజల్, హోటలియర్ జ్యోత్స్నా సూరిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోర్టు సూచించింది. హోటల్ అమ్మకాన్ని తిరిగి ప్రారంభించాలని కోర్టు కోరింది. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వంలో పెట్టుబడుల మంత్రిగా అరుణ్ శౌరీ ఉన్న సమయంలో ప్రభుత్వానికి భారీ నష్టంతో ఈ హోటల్‌ను విక్రయించినట్లు గుర్తించింది. హోటల్ లక్ష్మి విలాస్ విలువ రూ.252 కోట్లకు పైగా ఉండగా.. కేవలం రూ.7.5 కోట్లకు అమ్ముడైందని కోర్టు పేర్కొన్నది. మాజీ రాజ ఆస్తి అయిన ఈ లక్ష్మి విలాస్.. ఫతే సాగర్ ఒడ్డున ఉన్న ఐదు నక్షత్రాల హోటల్. ఇప్పుడు దీనిని లలిత్ లక్ష్మి విలాస్ ప్యాలెస్ అని పిలుస్తున్నారు. లక్ష్మి విలాస్ ప్యాలెస్ మొదట ఉదయపూర్ రాజులకు చెందిన రాచరికపు ఆస్తి. రాచరిక రాష్ట్రాల ముగింపు సమయంలో ఈ భారీ ఆస్తిని ప్రభుత్వానికి అప్పగించారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ప్రభుత్వం దీనిని హోటల్‌గా నడిపింది. 2002 లో దీనిని లలిత్ సూరి గ్రూప్ హోటళ్ళు పెట్టుబడి పెట్టి కొనుగోలు చేశాయి. 2002 కేసులో 'ఆధారాలు లేవు' అని సీబీఐ 2019 చివరిలో మూసివేత నివేదికను దాఖలు చేసింది. 'ఉదయపూర్ లోని మెస్సర్స్ లక్ష్మి విలాస్ ప్యాలెస్ హోటల్ పెట్టుబడులు పెట్టే మొత్తం పక్రియలో ప్రాసిక్యూషన్ ప్రారంభించటానికి ఆధారాలు లభించలేదని తేల్చారు' అని సీబీఐ తెలిపింది. అయితే జోధ్‌పూర్‌లోని ప్రత్యేక కోర్టు ఈ నివేదికను తిరస్కరించి తదుపరి దర్యాప్తునకు ఆదేశించింది. దర్యాప్తు సంస్థ నివేదిక ప్రకారం, ప్రభుత్వం నడుపుతున్న లగ్జరీ హోటల్‌లో పెట్టుబడులు పెట్టడం వలన 'ప్రభుత్వానికి దాదాపు రూ.143.48 కోట్లు నష్టపోయింది. ఈ ఆస్తి రూ.7.85 కోట్లకన్నా తక్కువ విలువనది అని ఒక ప్రైవేట్ సంస్థ మెస్సర్స్ కాంతి కరంసే సంస్థ చేసిన విలువ మదింపు ఆధారంగా రిజర్వ్ ధరను రూ.6.12 కోట్లుగా నిర్ణయించారని సీబీఐ తన నివేదికలో పేర్కొన్నది. 'దర్యాప్తులో మేము ఆదాయపు పన్ను శాఖ ద్వారా ఆస్తిని పునః పరిశీలించి దాని విలువ రూ. 193.28 కోట్లుగా మదింపు వేసాం. కాంతి కరంసే అండ్ కంపెనీ ఆస్తిని తక్కువ అంచనా వేయడం వల్ల ఖజానాకు నష్టానికి దారితీసింది' అని సీబీఐ వర్గాలు తెలిపాయి. లక్ష్మి విలాస్ ప్యాలెస్ హోటల్‌లో పెట్టుబడులు పెట్టడంలో ప్రదీప్ బైజల్ తన స్థానాన్ని దుర్వినియోగం చేశాడని ఆరోపించిన ప్రాథమిక విచారణ ఆధారంగా సీబీఐ 2014 ఆగస్టు 13 న కేసు నమోదు చేసింది. '1999 నుంచి 2002 వరకు తెలియని అధికారులు, ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వానికి డబ్బు నష్టాన్ని కలిగించే ఈ కుట్రలో పాల్గొన్నారు. భూమి చదరపు గజానికి రూ.45 విలువగా నిర్ణయించారు. ఈ విలువ కన్నా హోటల్‌లోని ఒక చెంచా అయినా ఎక్కువ ఖరీదైనది'అని సీబీఐ మూసివేత నివేదికపై న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కాగా, హోటల్ ను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఉదయపూర్ జిల్లా కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. 'మేము కోర్టు ఆదేశాన్ని అమలు చేస్తాం' అని ఉదయపూర్ కలెక్టర్ చేతన్ దేవ్డా అన్నారు. తాను ఇంతవరకు కోర్టు ఆదేశాలు చూడలేదు. తమ న్యాయవాదులు ఈ ఉత్తర్వును పరిశీలిస్తారు. తరువాత ఏమి చేయాలో నిర్ణయిస్తాం' అని సీబీఐ ప్రత్యేక కోర్టు ఉత్తర్వుపై అరుణ్ శౌరీ అన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంచిన మంత్రి

మహబూబ్‌నగర్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): పేదింటి ఆడబిడ్డలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తున్న కారణంగా వారికి భరోసా దక్కిందని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన 236 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. హన్వాడ మండలంలో 88 మంది లబ్దిదారులకు రూ. 88,90,000 విలువ చేసే చెక్కులను, జిల్లా కేంద్రంలోని జడ్పీ మీటింగ్ హాల్‌లో 148 మంది లబ్దిదారులకు రూ. 1,45,21,000 విలువ చేసే చెక్కులను అందజేశ

గర్భవతులు పోషక ఆహారం తీసుకోవాలి

వేములవాడ, సెప్టెంబర్, 18 (నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్లా జిల్లా వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపల్లి గ్రామంలో పోషణ అభియాన్ లో భాగంగా గర్భవతులకు తల్లులకు పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని ఆకుకూరలు కూరగాయలు పండ్లు పాలు గుడ్లు గర్భిణీలకు ప్రసవ జాగ్రత్తలు తీసుకోవాలని వివరించడం జరిగిందని అంగన్వాడి టీచర్ లు తెలిపారు. ఆరు నెలల పిల్లలకు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని వివరించడం జరిగింది కిచెన్ గార్డెన్ గురించి అవగాహన కల్పించారులో భాగంగా కోవిడ్ .. 19 కారణంగా పిల్లలు బరువు ఎత్తు ప్రతిరోజూ ఐదు మంది పిల్లలకు కొలతలు తీయడం జరుగుతుంది అని , పిల్లలకు తల్లులకు వాట్సాప్ గ్రూప్ ను ఏర్పాటు చేసి అవగాహన చేయడం టీవీల ద్వారా బోధన కార్యక్రమాలు జరుగుతున్నాయని దీన్ని అందరు గ్రహించి ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ సిహెచ్. అంజలి టీ. పద్మ,పంచాయతీ సెక్రెటరీ చందన ,ఆశ వర్కర్లు మంజుల, అధ్యక్షురాలు కె .మంగ కార్యదర్శి కె.రమాదేవి మహిళలు పాల్గొన్నారు

నిరుపేదలకు అండగా టీఆర్ఎస్ ప్రభుత్వం

జెడ్‌పిటిసి -మ్యాకల రవి , ఎంపీపీ- బూర వజ్రమ్మ బాబు

వేములవాడ, సెప్టెంబర్, 18 (నేటినిజం ప్రతినిధి):నిరుపేదలకు, అభాగ్యులకు టీఆర్ ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని జెడ్ పి టి సి మ్యాకలరవి అర్బన్ ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు అన్నారు. మండలంలోని కోడు ముంజ గ్రామానికి చెందిన సాయి నేని ఎల్లయ్య అనే నిరుపేద వ్యక్తి గత కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు శాసన సభ్యులు డాక్టర్ చెన్నమనేని రమేష్ బాబు గారి కృషితో టిఆర్ఎస్ పార్టీ తరఫున మృతుని కుటుంబానికి రూ. రెండు లక్షల మంజూరు కాగా ఇట్టి చెక్కును శుక్రవారం ఎల్లయ్య కుటుంబానికి జెడ్ పి టి సి మ్యాకల రవి ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు టిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు భూముల లక్ష్మణ్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూనిరుపేద కుటుంబానికి కష్టకాలంలో అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు సీఎం కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు, ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ జడల శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉరడి ప్రవీణ్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ మధు రాజేందర్ , రుద్రవరం సర్పంచ్ ఉర డి రామ్ రెడ్డి , చీర్లవంచ సర్పంచ్ మున్సిపల్ కౌన్సిలర్ వంగల దివ్య శ్రీనివాస్, టిఆర్ఎస్ యూత్ సీనియర్ నాయకుడు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ఆది శ్రీను జన్మదిన వేడుకలు

వేములవాడ, సెప్టెంబర్, 18 (నేటినిజం ప్రతినిధి):కాంగ్రెస్ పార్టీ నేత ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయం ముందు భాగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కేకును కట్ చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. శీనన్న ఆరోగ్యంగా ,ఆనందంగా నిండు నూరేళ్లు జీవించాలని ఆయన సేవలు నియోజకవర్గం ఇలాగే కొనసాగాలని అన్నారు . ఈ కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపిటిసి హైమద్ పాషా, నేరెళ్ల శ్రీధర్ గౌడ్, కనికరపు రాకేష్, కొలకని రాజు ,సాబీర్ ,వస్తాదా కృష్ణగౌడ్, పడిగెల మహేష్ రెడ్డి , తంగెళ్ల గణేష్, మర్రిపెల్లి రాజు, దాడి మల్లేశం, తిరుపతి. రాజేందర్, సిరిగిరి సీను ,మల్లేశం తదితరులు ఉన్నారు.

వేములవాడకు చెందిన యువ రిపోర్టర్ అనారోగ్యంతో మృతి

వేములవాడ, సెప్టెంబర్, 18 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మున్సిపల్ గ్రామ విలీనమైన నాంపల్లి గ్రామానికి చెందిన యువ జర్నలిస్ట్ అజయ్ కరీంనగర్ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు . అతడు హైదరాబాద్ లో డెక్కన్ టీవీలో సబ్ ఎడిటర్ గా , ప్రజా పక్షం పత్రికలో రిపోర్టర్ గా విధులు నిర్వహించాడు . చిన్న వయసులోనే అజయ్ మరణించడంతో కుటుంబీకులు , గ్రామస్థులు కన్నీరుమున్నీరవుతున్నారు

లక్ష ఇళ్లు చూసే ఓపిక ఏదీ

శివారుఇళ్లన్నీ గ్రేటర్ పరిధిలోకే వస్తాయి: తలసాని

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): లక్ష ఇండ్లు చూపించాలన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే భట్టి విక్రమార్క మధ్యలోనే వెనుగదిరిగాకరని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆ నిర్మాణాలను చూపించేందుకు సిద్ధమైనప్పటికీ వారికి ఓపిక లేకుండ ఆపోయిందన్నారు. శుక్రవారం తుక్కుగూడ, రాంపల్లిలో నిర్మిస్తున్న ఇండ్లను భట్టి విక్రమార్కకు మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, మేయర్ బొంతు రామ్మోహన్ కలిసి చూపించారు. కానీ భట్టి మాత్రం తన పర్యటనను అర్ధాంతరంగా ముగించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీలో స్థలం లేనందునే నగర శివారుల్లో డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించామని స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇండ్లు కట్టలేదని భట్టి అనడం సరికాదు. ఒక వేళ ఆయన జీహెచ్ఎంసీలో స్థలం చూపిస్తే అక్కడ తప్పకుండా ఇండ్ల నిర్మాణం చేపడుతామని మంత్రి స్పష్టం చేశారు. శివారుల్లో నిర్మిస్తున్న గృహాల్లో 90 శాతం ఇండ్లు నగర వాసులకే అని తెలిపారు.ఇండ్లు ఎక్కడ నిర్మించినా అవి హైదరాబాద్ వాసులకే ఇస్తామన్నారు. లక్ష ఇండ్లకు సంబంధించిన జాబితా ఇస్తామంటే కాంగ్రెస్ నేతలు పారిపోయారు అని మంత్రి తలసాని పేర్కొన్నారు. నగరంలో భూములు లేకనే శివారు ప్రాంతాల్లో నిర్మించామని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. నగరంలో ప్రభుత్వ భూమి లేకుండా చేసింది కాంగ్రెస్ నేతలే అని ఆయన ధ్వజమెత్తారు.

ప్రగతి భవన్ ముందు ఆందోళన: సీతక్క అరెస్ట్

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): సీఎం క్యాంప్ ఆఫీస్ దగ్గర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో క్యాంప్ ఆఫీస్ ముట్టడికి ప్రయత్నించిన ములుగు ఎమ్మెల్యే సీతక్కను, ఆందోళనకారులను పోలీసులు అరెస్ట్ చేశారు. వర్షాలకు నష్టపోయిన పంటకు పరిహారం చెల్లించాలని సీతక్క డిమాండ్ చేశారు. ఏకకాలంలో రుణమాఫీ చేయాలన్నారు. దీంతో పోలీసులకు,సీతక్కకు మధ్య తోపులాట జరిగింది. రైతుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో నిరసన తెలిపే హక్కు కూడా లేదన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చజరగలేదన్నారు. శుక్రవారం ప్రగతిభవన్ ముట్టడికి కాంగ్రెస్ కిసాన్ సెల్ యత్నించింది. దీంతో పోలీసులు అడ్డుకున్నారు. కారు దిగిన సమయంలో తనపై చేయవేసిన మహిళా పోలీస్‌ను సీతక్క హెచ్చరించారు. చేయిఎందుకు వేస్తారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో పోలీసులు, ఎమ్మెల్యే సీతక్క మధ్య తోపులాట జరిగింది. దీంతో ఆమెతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. రైతుల గురించి అసెంబ్లీలో ప్రభుత్వం చర్చించలేదని, భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని సీతక్క డిమాండ్ చేశారు. సభలో కనీసం మాట్లాడే అవకాశం కూడా ఇవ్వలేదని ఆమె మండిపడ్డారు. ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని దుయ్యబట్టారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ కార్యక్రమంలో ఎమ్మెల్యే సీతక్కతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు, కిసాన్ సెల్ నేత అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబు హయాంలో అనేక ఆలయాలు కూల్చారు: జివిఎల్

న్యూఢిల్లీ,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): హిందూ ఉద్ధారకుడిగా ప్రతి పక్షనేత చంద్రబాబు నాయుడు ప్రగల్భాలు పలుకుతున్నారని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మండిపడ్డారు. ఆయన హయాంలో అనేక దేవాలయాలను కూల్చేశారని, పుష్కరాల సమయంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని జీవీఎల్ ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అంతర్వేది, అమరావతిలపై సీబీఐ దర్యాప్తు జరపాలని కోరారు. గతంలో జరిగిన అవినీతిపై దర్యాప్తు జరగాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. దేవాలయాలపై జరుగుతున్న దాడుల నిరోధానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు లేఖ రాశామని తెలిపారు. చర్చి పై రాళ్ళు వేశారనే ఆరోపణలతో అరెస్టు చేసిన 41 మందిని తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రైవేట్ రైళ్లలో ఛార్జీలు వారి ఇష్టం

ప్రైవేట్ ఆపరేటర్లకు స్వేచ్ఛ ఉందన్న కేంద్రం

న్యూఢిల్లీ,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): దేశంలో ఏర్పాటయ్యే ప్రైవేట్ రైల్వేలకు ప్రయాణికుల ఛార్జీలను సొంతంగా నిర్ణయించుకునే స్వేచ్ఛ ఉంటుందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అయితే ఆయా మార్గాల్లో నడిచే ఏసీ బస్సులు, విమానాల ఛార్జీలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించుకోవాలని రైల్వే బోర్డు చైర్మన్ వీకే యాదవ్ తెలిపారు. దేశంలో ప్రతిరోజు ఆస్ట్రేలియా జనాభాకు సమానమైన ప్రయాణికులు రైళ్లలో ప్రయాణిస్తారని, ఎక్కువ మంది పేద ప్రజలు రైలు ప్రయాణాలపైనే ఆధారపడతారని చెప్పారు. దీంతో రైలు ఛార్జీల అంశం రాజకీయంగా సున్నితమైనదని ఆయన అన్నారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యం, అసమర్థ బ్యూరోక్రసీ కారణంగా దేశంలో రైల్వే వ్యవస్థ అభివృద్ధికి నోచుకోవడం లేదని యాదవ్ తెలిపారు. అందుకే ప్రధాని మోదీ ప్రభుత్వం రైల్వే స్టేషన్ల ఆధునీకరణ నుంచి ప్రైవేట్ రైళ్లు నడిపే వరకు ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యాన్ని కోరుతున్నదని చెప్పారు. ఆల్స్టోమ్ ఎస్ఏ, బొంబార్డియర్ ఇంక్, జిఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ వంటి సంస్థలు దేశంలో ప్రైవేట్ రైళ్ల నిర్వహణకు ఆసక్తి చూపుతున్నాయని యాదవ్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై టీఆర్ఎస్ శ్రేణులకు మంత్రి మార్గనిర్దేశం

మహబూబ్ నగర్, సెప్టెంబర్ 18: జిల్లా కేంద్రంలోని టీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై నిర్వహించిన సమావేశ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. పట్టభద్రుల నమోదు ప్రక్రియపై ప్రతి వార్డు, గ్రామాల నుంచి ఏర్పాటు చేసిన ఇంచార్జీలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. అన్ని ఎన్నికల లాగానే ఎమ్మెల్సీ ఎన్నికలను సైతం టీఆర్ఎస్ కైవసం చేసుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

దుబ్బాక ఉప ఎన్నికల్లో లక్ష మెజార్జీతో గెలిపించాలి

గడపగడపకూ వెళ్లి ఓట్లు అడగాలని శ్రేణులకు సూచన
కాంగ్రెస్,బిజెపిలకు డిపాజిట్ దక్కుతుందో లేదో తేలేదే ఎన్నిక
అనుబంధ సంఘాల సర్వసభ్య సమావేశంలో హరీష్ రావు

సిద్దిపేట,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల్లో లక్ష మెజార్జీతో టీఆర్ఎన్‌ని గెలిపించాలని టీఆర్ఎన్ శ్రేణులకు ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థి లేడు. బీజేపీకి కార్యకర్తలు లేరు. దుబ్బాకలో ఎవరు గెలుస్తారని యువకుల నుంచి పండు ముసలిని అడిగినా.. టీఆర్ఎస్‌దే విజయం అంటారన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు డిపాజిట్లు వస్తాయా అనేది తెలుసుకోవడం కోసమే ఈ ఉప ఎన్నికలని పేర్కొన్నారు. టీఆర్ఎస్‌కు ఓటు వేసేందుకు దుబ్బాక ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించాం. దుబ్బాక నియోజకవర్గంలో అతి త్వరలోనే ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వడమే మా లక్ష్యమని హరీశ్ రావు అన్నారు. జిల్లాలోని మిరుదొడ్డి మండల టీఆర్ఎస్ విద్యార్థి, యువత అనుబంధ సంఘాల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హరీశ్ రావు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..దుబ్బాక నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు ప్రతి గడప గడపకు వెళ్లి ప్రజలను కలువాలని అన్నారు. మనం చేసిన అభివృద్ధి పనులను వివరించాలని మంత్రి హరీస్ రావు అన్నారు.మిషన్ భగీరథతో మంచినీళ్ల బాధలు టీఆర్ఎస్ ప్రభుత్వంతో తొలగిపోయాయనే సంతోషంలో ఉన్నట్లు మంత్రి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఎక్కువ సాగునీరు దుబ్బాక నియోజకవర్గానికే వస్తుందన్నారు. లక్షా 25 వేల ఎకరాలకు సాగునీరు అందనుందని, పంట కాల్వలు, పిల్ల కాల్వలు తవ్వుకుంటే రెండు పంటలు వేసుకోవచ్చని వివరించారు. కేంద్ర ప్రభుత్వం బోరు బావులకు విద్యుత్ మీటర్ల బిగింపునకు పూనుకుంటున్నందున దానిని వ్యతిరేకిస్తూ.. టీఆర్ఎస్ కు ఓటు వేసి బీజేపీ డిపాజిట్ గల్లంతు చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అర్హత కలిగిన వారందరికి పింఛన్లు ఇప్పించే బాధ్యత నాదే అని హరీశ్ రావు హామీ ఇచ్చారు. దేశంలోని 18 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉంది. ఏ రాష్ట్రంలోనైనా బీడీ కార్మికులకు పింఛన్లు అందిస్తుందా? అంటూ సూటిగా ప్రశ్నించారు. దుబ్బాక నియోజకవర్గ పరిధిలో 56 వేల 906 పింఛన్లు ఉన్నాయని, ఇటీవల 5,877 కొత్త పింఛన్లు మంజూరైనట్లు వివరాలను వెల్లడించారు.

దుబ్బాకలో చదివిన కేసీఆర్ సారుకు.. బీడీ కార్మికుల బాధలు తెలుసునని, దుబ్బాకపై ప్రేమ, మమకారంతో దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.35 కోట్లు కేటాయించారన్నారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసే టీఆర్ఎస్ పార్టీని గెలిపించి అభివృద్ధి చేయించుకోవాలని పార్టీ కార్యకర్తలు, సంఘాల బాధ్యులు ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని మార్గదర్శనం చేశారు. ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడే టీఆర్ఎస్ కు లక్ష మెజార్టీ ఇవ్వాలన్నారు. కేసీఆర్ కు దండం పెట్టి దుబ్బాకను అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత నేను తీసుకుంటానని హరీశ్ రావు స్పష్టం చేశారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ..దుబ్బాక నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు మంత్రి హరీశ్ రావుకు పూర్తి అవగాహన ఉందన్నారు. బీజేపీకి ఓటు వేస్తే అభివృద్ధి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మల్లన్న సాగర్ జలాశయ కాలువ అభివృద్ధి పనులు ముమ్మరంగా చేస్తుంటే.. కోర్టు కేసులు పెట్టి అభివృద్ధికి నిరోధకులుగా మారుతూ.. కాంగ్రెస్, బీజేపీ వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. మాటలు చెప్పడం తప్ప బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో ఏమీ కాదని ఎంపీ తెలిపారు. ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ మాట్లాడుతూ.. టీఆర్ఎస్ అభ్యర్థిని లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ నేతలు వానకాలం కప్పల మాదిరిగా ఎన్నికలు రాగానే వచ్చిపోతారన్నారు. కార్యక్రమంలో పఠాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మిరుదొడ్డి మండల పార్టీ ఇంచార్జి సంగారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మిడ్ మానేరు నిర్వాసితుల ఆందోళన...

వేములవాడ, సెప్టెంబర్, 18 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మండలం సంకేపల్లి గ్రామంలోకి మిడ్ మానేరు బ్యాక్ వాటర్ రావడంతో తమ ఇళ్లకు నష్టపరిహారం రాలేదని , నష్టపరిహారం వెంటనే అందించాలని నిర్వాసితులు శుక్రవారం కరీంనగర్ – వేములవాడ రోడ్డుపై బైఠాయించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ .. మిడ్ మానేరు నీళ్లు ఇళ్ల వరకు వచ్చాయని , పాములు వస్తున్నాయని వాపోయారు . వెంటనే గ్రామానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు . ఈ ధర్నాలో నిర్వాసితులకు మద్దతుగా రుద్రావరం గ్రామ సర్పంచ్ ఉరడీ రాంరెడ్డి, ఎంపీటీసీ గాలి పెల్లి సువర్ణ స్వామి గౌడ్, ముంపు గ్రామాల వర్కింగ్ ప్రెసిడెంట్ పిల్లి కనుకయ్య, ఉపసర్పంచ్ తడెం శ్రీనివాస్ లు తదితరులు పాల్గొన్నారు

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు టోకరా

–సైబర్ నేరగాళ్ళను అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ సమయంలో ఉద్యోగాల పేరుతో మోసానికి పాల్పడిన నేరగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ముగ్గురు సైబర్ నేరగాళ్లను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. లక్నో కేంద్రంగా జాబ్ ఫ్రాడ్ మోసాలకు ఈ ముఠా పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నౌకరీలో అప్లోడ్ చేసిన రేజుంలను తీసుకొని ముఠా మోసాలకు పాల్పడినట్లు పోలీసులు చెబుతున్నారు. కెరీర్ స్టైల్ పేరుతో నకిలీ వెబ్ సైట్ క్రియేట్ చేసి నిందితులు మోసాలకు పాల్పడ్డారు. నౌకరీ వెబ్ సైట్ లో నుండి హైదరాబాద్‌కి చెందిన యువతకి ముఠా గాలం వేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. డేలాయిట్‌లో పని చేసిన ఒక ఉద్యోగికి మంచి జాబ్ అంటూ ఫోన్ కాల్ చేశారు. ఫేక్ లెటర్ , ఫేక్ ఇంటర్వ్యూ లు చేసి రిజిస్ట్రేషన్ ఫీ అంటూ బాధితులకు టోకరా పెట్టారు. బాధితులకు కాల్స్ చేయడానికి టెలి కాలర్స్‌ను ముఠా నియమించుకుంది. రెండు నెలల్లో ఈ ముఠాకు బాధితురాలు 38 లక్షలు చెల్లించింది. షాను అన్సారీ, యుగంటర్ శ్రీవాస్త, తుషార్ శ్రీవాస్తలను క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రముఖ ఐటీ కంపెనీ విప్రో లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఇప్పిసానని చెప్పి అమయాకులను మోసం చేసిన గుణ చంద్రశేఖర్ అనే వ్యక్తిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని కేపీహెచ్‌బీలో విన్సర్ సాఫ్ట్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ నీ పెట్టిన చంద్రశేఖర్.. 70 మంది నిరుద్యోగులను మోసం చేశాడు. ఫేక్ ఇంటర్వ్యూ లు నిర్వహించి, ఫేక్ లెటర్‌లు సృష్టించి.. ఒక్కొక్కరి నుంచి 2 లక్షల వరకు వసూలు చేసి, మొత్తమ్మీద 2 కోట్లు కాజేశాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న సైబరాబాద్ పోలీసులు శుక్రవారం అతన్ని అరెస్ట్ చేశారు. నిందుతుడి నుండి 15 లక్షల రూపాయల నగదు, నకిలీ జాబ్ లెటర్స్, లాప్ టాప్, మొబైల్ ఫోన్ ను, విప్రో కంపెనీ కి చెందిన 70 ఫేక్ లెటర్ లను ఎస్ వో టీ మాదాపూర్ పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈ చీటింగ్ కేసు గురించి సీపీ సజ్జనార్ మాట్లాడుతూ మోసాలకు పాల్పడిన చంద్రశేఖర్ 2007– 09 మధ్యకాలంలో మహేంద్ర సత్యం , పలు ఎం.ఎన్.సిలలో సాఫ్ట్ వేర్ గా పని చేశాడని చెప్పారు. మియాపూర్, కేపీహెచ్ బీ, చందా నగర్ లో నిందితుడు పై ఫిర్యాదులు ఉన్నాయన్నారు. ఎం ఎన్ సి నుండి జాబ్ కోసం డబ్బు చెల్లించమని ఎలాంటి కాల్స్ చేయరని సీపీ ఈ సందర్భంగా నిరుద్యోగులకు సూచించారు. ఆగంతకులు కాల్స్ చేసి డబ్బులు అడిగితే మీరు మోస పోయినట్టేనని , వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

కోదండరామ్‌కు మద్దతుగా పార్టీలకు టిఎజెఎస్ లేఖ

హైదరాబాద్,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కోదండరామ్‌కు మద్దతు ఇవ్వాలంటూ రాజకీయ పార్టీలకు టీజేఎస్ లేఖలు రాసింది. త్వరలో నిర్వహించబోయే నల్గొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నిక విషయమై కాంగ్రెస్, టీడీపీ, సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ పార్టీల కార్యాలయాలకు లేఖలు రాసింది. లేఖల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా కోదండరామ్‌కు మద్దతునివ్వాలని టీజెఎస్ కోరింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.